
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు

ఆదివారం 27 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత (అంచనా)

27-4-2025	గరిష్టం	కనిష్టం
గుంటూరు	40	25
తెనాలి	39	25
నరసరావుపేట	40	26
బాపట్ల	36	26
రెంటచింతల	40	27



sunday s.p.e.c.i.a.l

అల్లరి మాయం సెల్ మయం

స్క్రీన్ టైమ్‌లోనే **10 గంటలు**

ఒక రోజులో టీవీలు, మొబైల్, ట్యాబ్ లు, కంప్యూటర్లు వంటి వాటిని చూస్తూ గడపడాన్ని స్క్రీన్ టైమ్స్ అం టారు. ఒక రోజులో సగ టు మనిషికి 4 నుంచి 5 గంటల మాత్రమే స్క్రీన్ టైమ్‌లో ఉండాలి. కానీ పిల్లలే రోజుకు దాదాపు 10 గంటల వరకు స్క్రీన్ టైమ్‌కు కేటా యిస్తున్నారు. మూడు నుంచి ఆరేళ్ల లోని ప్రతి 10 మంది పిల్లల్లో 8 మంది అధికంగా స్క్రీన్ టైమ్స్ లో గడ పటం వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి లోన వుతున్నారు.

> డిజిటల్ బేబీలుగా పుడుతున్న ప్రస్తుత తరానికి ఊహ రాగానే వారి చేతికి ఫోను అందించి వారి జీవితాల్ని మొగ్గ దశలోనే నాశనం చేస్తున్నారు.
> - డాక్టర్ ప్రియాంక్‌జైన్, ఢిల్లీకి చెందిన పిల్లల వైద్య నిపుణులు

అమ్మో గడుగ్గాయి.. ఒక్కక్షణం ఊరకే ఉండడు.. అల్లరితో ఆగమాగం చేస్తాడు.. ఇల్లు పీకి పంది రేస్తాడు.. పిల్లలు ఉండే ఇళ్లు.. వీధులు.. కాలనీ లు వారి అల్లరిచిల్లర పనులతో సందడిగా ఉం డేవి.. అయితే ఇదంతా గతం. అలాంటి పరి స్థితులు ప్రస్తుతం నగరాలు కాదు కదా.. పట్ట ణాలు.. పల్లెల్లో కూడా కాన రావడంలేదు. పెద్దల తో పాటు పిల్లలు కూడా సెల్‌ఫోన్లతో కాలం గడుపుతున్నారు. కాలక్షేపం చేస్తున్నారు. ఊయ లలో ఉండే చిన్నారులకు కూడా తల్లులు సెల్ ఫోన్ చూపిస్తూ వారి అల్లరిని కట్టడి చేస్తు న్నారు. దీంతో ప్రస్తుత తరం డిజిటల్ బేబీలుగా మారుతున్నారు. చందమామా రావే.. జాబిల్లి రావే అంటూ పెద్దలు చిన్నారులకు గోరుముద్దలు తినిపించే రోజులు మాయమై పోయా యి. ఇప్పుడంతా సెల్‌మయమే. ఏడు స్తున్నా.. అల్లరి చేస్తున్నా.. తినిపిం చాలన్నా.. సెల్‌ఫోన్ ఇచ్చేస్తు న్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే బొమ్మలు చూస్తూ అదే లోకంగా ఉండిపోతున్నారు. స్క్రీన్ మాయ లో పిల్లలు సర్వసాధారణ లక్షణాలైన ముద్దు ముద్దు మాటలు.. అల్లరి.. నవ్వడం.. ఏడవడం.. తదితర లక్షణాలను కోల్పోతున్నారు.

- కనుమరుగవుతోన్న గడుగ్గాయిలు
- డిజిటల్ బేబీలుగా మారుతోన్న చిన్నారులు
- ఎక్కువ సమయం స్క్రీన్ టైమ్‌తో పిల్లలు
- భావితరం భవిష్యత్‌కు ముప్పంటున్న వైద్యులు
- రక్షించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే అంటూ సూచన

అల్లరితోనే.. ఆయుష్షు



ఏ కదలిక లేకుండా పిల్లలు కూర్చోవడం వల్ల తల్లిదం డ్రులకు సౌకర్యంగా ఉంటుదేమోగాని చిన్నారుల్లో శారీ రక, మానసిక ఎదుగుదల ఉండదు. పిల్లల్లో అల్లరే వారికి ఆయుష్షు అని తెలుసుకోవాలి. అల్లరి చేష్టలే వారికి ఆరోగ్యం అని ప్రస్తుత తరం తల్లిదండ్రులు గుర్తించుకోవాలి. ఏడేళ్లు కాపాడితే మొక్క కూడా మహా వృక్షమై తరతరాలకు నీడనిస్తుంది అని మహాత్మా గాంధీ చెప్పిన మాటలు పిల్లల కు కూడా అనువ దించా ల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. అల్లరి చేయడం లేదనే విషయాన్ని మానసిక లోపంగా గుర్తించాలే తప్ప గొప్పగా భావించకూడదు.

పిల్లలో సమస్యలు..



పిల్లలు అదేపనిగా స్క్రీన్‌టైమ్‌లో గడపటం వల్ల ఆయా స్క్రీన్లలో చూసిన విషయాలు మినహా వారి మెదళ్లలో ఇంకేమి ఉండటం లేదు. తలనొప్పి, వెన్నుముక నిటారుగా లేకపోవడం, స్వచ్ఛంగా మాట్లడలేక పోవడం, కంటికి ఇబ్బందులు వంటి ఆరోగ్యపరమైన సమస్యలతో భావి తరమైన నేటి పిల్లలు అల్లాడుతు న్నారు. రానున్న రోజుల్లో పెద్దలకు దూరంగా ఉండటం, ఎలక్ట్రానిక్ గాడ్జె ట్లు ఇచ్చిన వారి పట్ల కృతజ్ఞతా భా వం, ఊబకాయం, ఫోన్‌లో ఆడే గేము ల్లో రివార్డులు వస్తే అమితంగా సంతోషప డటం, ఒంటరిగా గడపాలనే ఆలోచన.. వంటి మానసిక సమస్యలు పిల్లల్లో వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చేతికి దొరి కింది నోట్లో పెట్టుకోవడం లేక పోతే పగల గొట్టడం.. వస్తు వులను చిందరవందరగా పడేయడం.. బొమ్మలు పగ లగొట్టడం.. గాయాలు చేసు కోవడం.. ఏడవడం.. నవ్వ డం.. ఇదంతా చిన్న పిల్లల లక్షణాలు. అయితే ఈ అల్లరి చేష్టలు మధుర జ్ఞాపకాలుగా మిగి లిపోతాయా అంటే ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు చూస్తే అవునంటున్నారు.. మానసిక వైద్యనిపుణులు. యాంత్రిక జీవితా నికి తల్లిదండ్రులు అలవాటు పడిపోగా.. అపురూపంగా పెంచాల్సిన పిల్లలను కూడా ఆ మాయలో పడేస్తున్నారు. కౌమార, యవ్వన దశలో ఉన్న వారిపై స్మార్ట్ ఫోన్లు ప్రభావం చూపుతున్నాయని ఇప్పటి వరకు విన్నాం. కానీ వాటి ప్రభావం చిన్నారులపై కూడా పడిందనే కఠోర సత్యం తాజా పరి శోధనల్లో తేలింది. దీంతో చిన్నారుల ప్రవ ర్తన, నడవడికల్లో తీవ్ర మార్పులు వచ్చాయి. పిల్లలు ఏడ్చినా.. మారం చేసినా వారి చేతికి ఫోను ఇవ్వడం వల్ల ఇటువంటి ఉపద్రవం వచ్చిందని (మిగతా 8వ పేజీలో)

వేగవంతంగా మోదీ పర్యటన ఏర్పాట్లు

- వీవీఐపీలు 100, ఎంఐపీలు 15 మంది రాక
- ఎవరూ ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేయాలి
- ప్రధాన మంత్రి కార్యక్రమ నోడల్ అధికారి వీరపాండియన్
- సభా ప్రాంగణంలో అధికారులతో సమీక్షలు



వెలగపూడిలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్



సమీక్షలో మాట్లాడుతున్న సీనియర్ ఐఏఎస్ అధికారి వీరపాండియన్, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్

తుళ్లూరు(వెలగపూడి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజ ధాని అమరావతిలో శుక్రవారం ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రధాని సభకు 100 మందికి పైగా వీవీఐపీలు, 15 మంది వరకు ఎంఐపీలు, 5 వేల మంది వరకు వీఐపీలు రానున్నారు. ఈ క్రమంలో ఆ స్థాయిలో అధికారులు వెలగపూడి సచివాల యం సమీపంలో చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. రాజధాని నిర్మాణ పనుల ను పునర్ ప్రారంభించేందుకు అమరావతికి రానున్న నరేంద్ర మోదీ పర్యటనని విజయవంతం చేయాలని ప్రధానమంత్రి కార్యక్రమ నోడల్ అధికారి, సీనియర్ ఐఏఎస్ వీరపాండియన్ ఆదేశించారు. సచివాలయం వెనుక వేదిక ప్రాంగణంలో జరు గుతున్న ఏర్పాట్లను సంబంధిత నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా వీరపాండియన్ మాట్లాడుతూ మోదీ శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గన్నవరం విమా నాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో సచివాలయానికి చేరుకుంటారన్నారు. అనంతరం 1.4 కిలో మీటర్ల మేర రోడ్డు షో ద్వారా సభా ప్రాంగణానికి చేరుకుం టారని తెలిపారు. సభ అనంతరం సాయంత్రం ఐదు గంట లకు హెలికాప్టర్లో గన్నవరం చేరుకుని ఢిల్లీ వెళ్తారని చెప్పారు. ప్రధాని సభకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ప్రముఖులు చేరుకునేలా 8 రూట్లను సిద్ధం చేస్తున్నామని, వాహనాలు పా ర్కింగ్ కోసం 9 స్థలాలను గుర్తించి అక్కడ తాగునీరు, ఆహా రం, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించడం జరుగు తుందన్నారు. సభకు వచ్చే ప్రజలందరికీ పూర్తి స్థాయిలో ఆహారం అందించడం జరుగుతుందని, ఆయా పార్కింగ్ ప్రాం తాల్లో సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజలతో పాటు ప్రముఖులు కూడా ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ నెల 30న రిహార్సల్ ఉంటుందని, తదుపరి ఎస్పీజీ రిహార్సల్స్ ఉంటుందన్నారు. ప్రధాని వచ్చే సమయానికి పూర్తిస్థాయిలో ప్రజలందరికీ ఆహారం అందించటం జరుగుతుందని ఇందుకు సంబంధించి అయా పార్కింగ్ ప్రాంతాల్లో సరిపడా కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అదనపు డీజీపీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పార్కింగ్ ప్రాంతంలో నిరం తరం మైక్ అనౌన్స్‌మెంట్ చేసే ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ డ్యూటీ పాస్‌లకు సంబంధించి ఆయా శాఖలు వెంటనే జాబితా ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఐజీలు శ్రీకాంత్, సర్వశ్రేష్ఠ త్రిపాఠి, సీయూఎం త్రివిక్రమవర్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులను గౌరవించుకునే సభ : మంత్రి మనోహర్

ప్రధాని మోదీ సభ ద్వారా రాజధాని నిర్మాణానికి భూము లు ఇచ్చిన రైతులను గౌరవించుకునే కార్యక్రమం అని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వెలగపూడిలో ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను అధికారులతో కలిసి మంత్రి నాదెండ్ల మనో హర్ పరిశీలించారు. ఐదు, ఆరు జిల్లాల నుంచి నాలుగు లక్షల నుంచి ఆరు లక్షల వరకు రావడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారన్నారు. సోమవారం ఎస్పీజీ సిబ్బంది వచ్చి సభా ప్రాంగణాన్ని పరిశీలించిన తర్వాత వారి సూచనలకు అనుగుణంగా ఏమైనా ఏర్పాట్లు అవసరమో పునర్ పరిశీలి స్తామన్నారు. సీడ్ యాక్సెస్ రోడ్డుని పూర్తిగా ఉపయోగించు కుంటామన్నారు. అవసరమైతే పశ్చిమ బైపాస్ రోడ్డుని కూడా ఉపయోగించుకోవాలని చూస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా అన్ని సౌకర్యాలు ఉండాలని సీఆర్‌డీఏ అధి కారులకు మంత్రి పలు సూచనలు చేశారు. సభా వేదిక వద్ద కు దారితీసే రోడ్లను మంత్రి పరిశీలించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ప్రధాన మంత్రి పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ నోడల్ అధికారి వీరపాండ్యన్, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్ జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ తేజ, ఆర్డీవో కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లాడ్జీలు, హోటళ్లలో సోదాలు

జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో తనిఖీలు ● అమరావతిలో మోదీ పర్యటనతో పోలీసుల అప్రమత్తం



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కశ్మీర్‌లో ఉగ్రదాడి.. రాజధాని అమరావతిలో శుక్రవా రం ప్రధానమంత్రి మోదీ పర్యటనతో జిల్లా పోలీ సులు అప్రమత్తమయ్యారు. శనివారం రాత్రి ఏకకా లంలో జిల్లావ్యాప్తంగా రెండు గంటల సేపు లాడ్జీలు, హోటళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల కశ్మీర్‌లో ఉగ్రదాడి దృష్ట్యా రాష్ట్రమంతటా భద్రతా బలగా లను అప్రమత్తంగా ఉంచాలని పోలీస్ అధికారులకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం 4 గంటల నుం చి ఆరు గంటల మధ్య జిల్లా వ్యాప్తంగా పోలీసు లు తనిఖీలు చేశారు. పలువురిని తనిఖీ చేసి సాంకేతిక పరికరాల ద్వారా అనుమానితుల వేలి ముద్రలు పరిశీలించారు. అనుమానితులు, పాత నేరస్తులు, కొత్త వ్యక్తులు, ప్రదేశాలకు - పరిస్థితు లకు సంబంధం లేని వ్యక్తులు ఉండగా వారు అక్కడ ఎందుకు ఉన్నారు?, ఎక్కడ నుంచి వచ్చారు? ఎక్కడికి వెళ్తున్నారు? ఏ పని కోసం వెళ్తున్నారు? వంటి పలు కోణాల్లో విచారిస్తూ తనిఖీలు నిర్వహిం చారు. పలు ప్రధాన కూడళ్లు, అంతర్ జిల్లా చెక్ పోస్టుల వద్ద విస్తృతంగా వాహన తనిఖీలు చేప ట్టారు. ఎవరైనా వ్యక్తులు అనుమానాస్పదంగా, కొత్త గా కనిపించినా వెంటనే స్థానిక పోలీసులకు లేదంటే 112 నంబర్ ద్వారా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

పోలీసుల అదుపులో బంగ్లాదేశీయుడు ❽

క్యాంపుల్లో కార్పొరేటర్లు

- కూటమి.. చలో బాపట్ల రిసార్ట్స్
- గన్నవరం ఫామ్ హౌస్‌లో వైసీపీ..
- కూటమి మేయర్ అభ్యర్థిగా నానీకి బీఫారం
- వైసీపీ మేయర్ అభ్యర్థిత్వంపై తర్జన భర్జన
- కౌన్సిల్‌లో రేపు ఉదయం మేయర్ స్థానానికి ఎన్నిక



కూటమి మేయర్ అభ్యర్థిగా కోవెలమూడి నానీకి బీ ఫారం అందజేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఓడి నా బరిలోకి దిగాలని వైసీపీ అధిష్ఠానం రావడం తో క్యాంపు రాజకీయాలకు తెరలేచాయి. వైసీపీ నేతలు తమ కార్పొరేటర్లను గన్నవరం సమీపం లోని ఓ ఫామ్ హౌస్‌కు తరలించినట్లు తెలిసిం ది. దీంతో కూటమి నేతలు కూడా కార్పొరేటర్లను బాపట్లలోని ఓ రిసార్ట్స్‌కు తరలించేందుకు సన్న ద్ధమయ్యారు. సోమవారం ఉదయం నేరుగా నగరపాలక సంస్థ కార్యాలయానికి వచ్చి ఎన్ని కలో పాల్గొనేలా ఆయా పార్టీల నేతలు కార్యా చరణ రూపొందించారు. కాగా వైసీపీ మేయర్ అభ్యర్థి విషయమై ముఖ్య నేతలు తర్జన భర్జన పడుతున్నారు. గెలిచే అవకాశాల్లేక పోవడంతో ఎవరూ కూడా ఉత్సాహంగా ముందుకు రావ డం లేదు. దీంతో ఎవరో ఒకరిని బలవంతంగా ఒప్పించి ఎన్నికల బరిలోకి దింపేందుకు పార్టీ సీనియర్ నేతలు ప్రయత్నిస్తున్నారు. 30వ డివిజన్ కార్పొరేటర్ అచ్చాల వెంకటరెడ్డిని బరిలోకి దించాలనుకున్నా ఆయనపై హత్యాయ త్నం వంటి కేసులు ఉన్నాయని విరమించు కు న్నారు. ఈ నేపథ్యంలో 36వ డివిజన్ కార్పొ రేటర్ ఉడుముల లక్ష్మీ పేరు తెరపైకి వచ్చింది.

ఆరు ఓట్ల తేడాతో కూటమి విజయం..

కూటమి తరఫున మేయర్ అభ్యర్థిగా నెల క్రితమే నిర్ణయించిన టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్ర (నాని) అభ్యర్థిత్వాన్ని ని ర్ధారిస్తూ టీడీపీ, జనసేన జిల్లా అధ్యక్షులు తెనా లి శ్రావణ్ కుమార్, గాదె వెంకటేశ్వరరావు శని వారం బీ ఫారం అందజేశారు. దీంతో ఆయన కూటమికి చెందిన కార్పొరేటర్లతో క్యాంపునకు వెళ్లారు. వైసీపీ పక్షాన 27 మంది కార్పొరేటర్లు ఉండగా వారిలో ఒకరైన మాజీ మేయర్ కావటి మనో హర్‌నాయుడు ఎన్నికల్లో పాల్గొనే అవ కాశం లేదని చెబుతున్నారు. రెండు రోజుల క్రితం వైసీపీ ముఖ్య నేతల ఆధ్వర్యంలో జరిగిన బ్రేక్ ఫాస్ట్ సమావేశంలో కూడా కావటి పాల్గొనలేదు. ఆయన స్థానికంగా అందుబాటు లో లేరని అనుయాయులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో కార్పొరేటర్లు 26, ఎమ్మెల్సీలు ఇద్దరు కలిస్తే వైసీపీ బలం 28 అవుతుంది. ఇక టీడీపీ తరఫున 23 మంది, జనసేన తరఫున ఆరుగురు కార్పొరేటర్లు ఉన్నారు. వీరికి అదనంగా ముగ్గు రు ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్సీ కలిస్తే కూటమి బలం 34 అవుతుంది. ఈ ప్రాతిపది కన ఎన్నిక జరిగితే కూటమి అభ్యర్థి ఆరు ఓట్ల తేడాతో విజయం సాధించే అవకాశం ఉంది.

మేయర్ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

గుంటూరు కార్పొరేషన్: గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ ఎన్నిక సోమవారం ఉదయం 11 గంటలకు జరగనున్నది. కౌన్సిల్ సమావేశం మందిరంలో జరిగిన ఏర్పాట్లను శనివారం కమిషనర్ పులి శ్రీనివాసులు పరిశీలించారు.

బగళాముఖి సేవలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్

పిట్లలవానిపాలెం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): చందోలు గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవస్థానానికి శనివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వైవీఎస్‌బీజీ పార్థసారథి కుటుంబ సమేతంగా విచ్చేశారు.



బగళాముఖి అమ్మవారి సన్నిధిలో హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పార్థసారథి, కుటుంబ సభ్యులు

అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మర్యాదలతో దేవస్థానం తరుపున వేద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేసి, అమ్మవారి చిత్రటాన్ని బహూకరించినట్లు ఈవో జీ నరసింహమూర్తి తెలిపారు.

జనానికి పొగబెట్టి..

రైతులను మురుగులో ముంచేస్తారా!

● రూ. 3.19 కోట్లు ఖర్చుపెట్టి చేసేది ఇదేనా? ● చెత్త నిర్వహణ తీరుపై మండిపడ్డ మంత్రి మనోహర్

తెనాలి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'చుట్టుపక్కల నివాసాలుంటే ఈ పొగపెట్టడమేంటీ.. డంపింగ్ యార్డు మురుగు పక్కనున్న రైతుల పొలాలు నాశనంచేస్తుంటే ఏం చేస్తున్నారు.. కొబ్బరి బోండాలు పేరుకుపోయి, దోమలు పెరిగిపోతున్నాయి.. ఈ యంత్రాలను తుప్పు పట్టిస్తున్నారు! ఇదేనా ప్రజాధనం సద్వినియోగం చేయటమంటే? మీరు అసలు ఇంజనీర్లేనా! ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోతే ఎలా?' అంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మున్సిపల్ అధికారులపై తీవ్రంగా మండిపడ్డారు. ఇకపై పని తీరు సక్రమంగా లేకుండా, నిర్లక్ష్యంగా ఉంటే మా దగ్గర అవసరంలేదంటూ హెచ్చరించారు. మంత్రి మనోహర్ శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. జరుగుతున్న పనులు, అధికారులు తీసుకుంటున్న చర్యలను



చెత్త నిర్వహణ పనులపై అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మంత్రి మనోహర్

పరిశీలించారు. దీనిలో భాగంగానే బుర్రిపాలెం రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును పరిశీలించారు. రూ. 3.19 కోట్లతో చెత్తను ఎరువుగా తయారుచేసే పనులను చూశారు. ఒప్పందం ప్రకారం కా కుండా చెత్తను కేవలం పైపైన సరిచేస్తే సరిపోతుందా అంటూ అధికారులను, కాంట్రాక్ట్ ప్రతినిధులను ప్ర శ్నించారు. మూడడుగుల లోతు పిట్ తీసి, కింది నుం చి చెత్తను ఎరువు రూపంలోకి మార్చాల్సి ఉంటే, పైపైన చేసుకుపోతుంటే మీరేంచేస్తున్నారని కమిషనర్ శేషన్న, ఏఈ, మిగిలిన ఇంజనీర్‌లను ప్రశ్నించారు. 'ఒప్పందంలో ఏముందో! కాంట్రాక్టర్ ఏం చేస్తున్నారో కూడా చూసుకోరా! రూ. కోట్ల ప్రజాధనం ఇస్తున్నామంటే ఆ మాత్రం బాధ్యత చూపలేరా!' అంటూ కేకలు వేశారు. డంపింగ్ యార్డులో కొబ్బరి బోండాలను పొడి చేసేలా ఏర్పాటు చేసిన యంత్రాన్ని నిరుపయోగంగా వదిలేయడంపైనా సీరియస్ అయ్యారు. ఏఈని ప్రశ్నిస్తే మోటార్లు రిపేరులో ఉన్నాయని బదులివ్వటంతో మంత్రి మండిపడ్డారు. గతంలోనూ తనని హెచ్చరించామని ఇట్లా అయితే బయటకు పంపేయడం ఒక్కటే మార్గమన్నారు. ఎక్కడ లోపం కనిపించినా, దానికి బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

తప్పు మావల్లే జరిగింది... క్షమించండి

పొలాలు మురుగు మయమై పంట పండకుండా నష్టం కలగటానికి కారణం తామేనని, క్షమించమని మంత్రి నాదెండ్ల బాధిత రైతులను కోరారు. త్వరలో ఇబ్బందులు పడకుండా.. జాగ్రత్తలు తీసుకుంటామంటూ వివరణిచ్చారు. చెత్త సేకరణ కేంద్రం నుంచి చుట్టుపక్కల ఉన్న పొలాల్లోకి మురుగు చేరిపోవడం, చెత్త, ప్లాస్టిక్ కాగితాలు ఎగిరివెళ్లి చేలల్లో పేరుకుపోవడం వంటివాటిని పరిశీలించిన మంత్రి రైతులను పిలిచి క్షమాపణ కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ శేషన్నకు ఆదేశాలు జారీ చేశారు.

అతి వేగం.. నిర్లక్ష్యం

● పల్నాడు జిల్లా శాంతి నగర్ వద్ద ట్రావెల్ బస్సు బోల్తా ● ప్రమాదంలో ఒకరు మృతి, ఎనిమిది మందికి గాయాలు ● అతివేగంతో ఎదురుగా వస్తున్న వాహనాన్ని క్రాస్ చేయబోయి ప్రమాదం

శాంతినగర్(నకరికల్లు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా, నకరికల్లు మండలం శాంతినగర్ మంచినీటి చెరువు వద్ద హైదరాబాద్ నుంచి చీరాల వైపు వెళ్తున్న ట్రావెల్ బస్సు శనివారం ఉదయం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో హైదరాబాద్ నుంచి చిలకలూరిపేటలో బంధువుల పెళ్లికి వెళ్తున్న మహమ్మద్ ఫరూక్(55) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎనిమిది మందికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, నకరికల్లు ఎస్ఐ చల్లా సురేష్ ఘటనా స్థలానికి చేరుకుని.. క్షతగాత్రులను వాహనాల్లో నరసరావుపేటకు తరలించారు. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదానికి కారణమని క్షతగాత్రులు చెబుతున్నారు. పోలీసులు, బస్సులోని ప్రయాణికులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్ నుంచి ట్రావెల్ బస్సు చీరాలకు బయలు దేరింది. బస్సు నకరికల్లు అడ్డ రోడ్డు దాటిన తర్వాత బోల్తాపడిందని ప్రయాణికులు చెప్పారు. రోడ్డు సైడు ఎడ్జస్టమెంట్ చూసుకోకుండా అంతివేగంగా.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పింది. ఓ మహిళ బస్సు లోపల కింది భాగంలో ఇరుక్కుని పోవడంతో.. క్రేన్, ఎక్సకవేటర్ సాయంతో బస్సును పైకి లేపి ఆ మహిళను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, మార్టూరుకు చెందిన అవనిక అనే యువతి బురదలో కూరుకుపోయింది. సుమారు గంటన్నర వరకు పైగా పోలీసులు, స్థానికులు ఆమెను అతి కష్టం మీద బయటకు తీశారు. అద్దంకి మండలం జంతాలకు చెందిన ఉయ్యాల శ్రీనివాసరావు, ఉయ్యాల సీత, రొంపిచర్ల మండలం



బోల్తా పడిన ట్రావెల్ బస్సు (ఇన్‌సెట్లో) మృతుడు మహమ్మద్ ఫరూక్

దాసరిపాలేనికి చెందిన వేల్పుల నాగజ్యోతి, వేల్పుల నాగార్జున, బాపట్ల జిల్లా వలపర్ల గ్రామానికి చెందిన వంకాయల మోహన్, చీరాలకు చెందిన ఎడవల్లి నాగ వెంకట మోహన్ రావు, నాలుగేళ్ల వయస్సున్న కోట రుహికలు గాయపడ్డారు. ప్రమాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్‌విప్ జీవీ అంజనేయులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ వివరాలు అడిగి తెలు సుకున్నారన్నారు. సకాలంలో క్షతగాత్రులకు ఆస్పత్రికి తరలించి వైద్య అందించిన పోలీసులను జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అభినందించారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, రూరల్ ఎస్ఐ కిషోర్, నకరికల్లు ఎస్ఐ సీహెచ్ సురేష్ బాబు, పోలీసు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు.

నాలుగేళ్ల బాలికపై వృద్ధుడి అత్యాచారయత్నం

మేడికొండూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అభంశుభం తెలియని నాలుగేళ్ల బాలికపై ఒక కామాంధుడు అత్యాచారయత్నం చేసిన ఘటన మేడికొండూరు మండలం మందపాడు గ్రామంలో శనివారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మందపాడు గ్రామంలో గంగోలు రాజు (52) అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్న నాలుగేళ్ల బాలికకు చాక్లెట్ ఇస్తా నని ఆశ చూపి తన ఇంటికి తీసుకువెళ్లాడు. బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. కొంతసేపటి నుంచి బాలిక కనిపించకపోవడంతో ఆమె తల్లి సమీప ప్రాంతంలో వెతికింది. బాలికతో ఆడుకునే మరో బాలిక ఇచ్చిన సమాచారంతో గంగోలు రాజు ఇంటికి వెళ్లి చూసింది. తన కూతురి పట్ల రాజు వికృత చేష్టలు చూసి బయపడిపోయింది. వెంటనే తన కుమార్తెను తీసుకుని బయటకు పరుగులు తీసింది. జరిగిన విషయాన్ని స్థానికులకు చెప్పడంతో.. కోపోద్రిక్తులైన వారు రాజుని బంధించి మేడికొండూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు రాజు నేర చరితుడని మందపాడు గ్రామంలో 2006లో జరిగిన హత్య కేసులో ముద్దాయని పోలీసులు తెలిపారు. పాపను చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉపాధి వేతనం రూ.300 అందాలి

● రోజుకు 90 వేల మంది శ్రామికులకు పనులు కల్పించాలి ● పల్నాడు కలెక్టర్ పి.అరుణ్‌బాబు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నరసరావుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధి హామీ శ్రామికుల సగటు వేతనం రూ.300 పైనే ఉండేలా పనులు చేపట్టాలని, రోజుకు 90 వేల మందికి ఉపాధి కల్పించాలని కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. ఉపాధి పని దినాల్లో.. భారీగా కోత.. అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వెలవడిన కథనంపై కలెక్టర్ స్పందిం చారు. కలెక్టరేట్‌లో శనివారం ఉపాధి పనుల అమలుపై సమీక్షించారు. రోజుకు 90 వేల శ్రామికులకు ఉపాధి కల్పిం చడం లక్ష్యంగా నిర్దేశించగా సగటున 50 శాతం మంది మా త్రమే ఉపాధి పొందుతున్నారన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఏపీఎంలు ఉపాధి కల్పనలో రోజు వారీ లక్ష్యాలను చేరుకునేలా కృషి చేయాలని ఆదేశించారు. జిల్లాకు మంజూరైన 6,500 ఫాం పాండ్లకు గానూ 2,200 పాండ్ల నిర్మాణానికి అనుమతులు పొందాల్సి ఉందన్నారు. ఇప్పటికే అనుమతులు పొందిన 4,341 పాండ్ల నిర్మాణాలు.. దాదాపు 12,000 కి.మీ మేరకు కాల్వల పూడిక తీత పనులు, 553 చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో డీఆర్వో మురళి, జిల్లా అటవీ అధికారి కృష్ణ ప్రియ, డ్వామా పీడీ సిద్ధ లింగ మూర్తి, డీఆర్డీఏ పీడీ ఝాన్సీ రాణి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

సంగీత ప్రదర్శనలో ముగ్గురికి గిన్నిస్ రికార్డు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు, బాలుడు గిన్నిస్ రికార్డు సాధించారు. 2024 డిసెంబరులో జరిగిన ప్రపంచస్థాయి సంగీత ప్రదర్శనలో వీరు పాల్గొన్నారు. 18 దేశాల నుంచి 1,046 మంది కీబోర్డు వాయిద్యం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న బాలుడు నిశ్శంకరరావు అభిషేక్, బాలికలు యండ్రపాటి నయనశ్రీ, మౌనిక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సాధించారు. ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గిన్నిస్ సంస్థ ప్రతినిధుల నుండి సర్టిఫికెట్, మెడల్ అందుకున్నారు. వీరు హలేల్ మ్యూజిక్ స్కూల్ అగస్టీన్ వద్ద శిక్షణ పొందారు. గిన్నిస్ రికార్డు అందుకున్న వారిని పలువురు అభినందించారు.



గిన్నిస్ రికార్డులు అందుకుంటున్న బాలికలు యండ్రపాటి నయనశ్రీ, మౌనిక, బాలుడు నిశ్శంకరరావు అభిషేక్

భార్యపై అనుమానంతో పక్కింటి వ్యక్తిపై కత్తితో దాడి

రేపల్లె, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 5వ వార్డులో నివాసం ఉంటున్న దేవరకొండ కోటి అనే వ్యక్తి శనివారం పక్కింట్లో ఉంటున్న దేవరపల్లి నవీన్ అనే వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ మల్లికార్జునరావు వివరాల మేరకు.. దేవరకొండ కోటి తన భార్యకు, నవీన్‌కు అక్రమ సంబంధం ఉందని అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో నవీన్‌ను కత్తితో విచక్షణా రహితంగా నరికాడు. స్థానికులు గుర్తించి తీవ్రంగా గాయపడిన నవీన్‌ను ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అతనిని గుంటూరు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వడ గాల్పులకు వృద్ధుడి మృతి

బెల్లంకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాయపాలెంలో శనివారం మధ్యాహ్నం వడగాల్పులకు వృద్ధుడు చిన్న సుబ్బయ్య (81) మృతి చెందాడు. వడ గాల్పులకు తట్టుకోలేక అతను మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పులుసు వీరారెడ్డి (ఫైల్‌ఫొటో)

వెల్దుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన వెల్దుర్తిలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పులుసు వీరారెడ్డి (40) తన రెండెకరాలతో పాటు మరో ఎనిమిది ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి పంటలు సాగు చేశాడు. మూడేళ్లుగా పంటలు సరిగా పండక సుమారు రూ.25 లక్షలు దాకా అప్పులు పేరుకుపోయాయి. దీంతో మనస్తాపం చెందిన వీరారెడ్డి పొలానికి వెళ్లి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చీకటి పడుతున్నప్పటికీ అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూడగా వీరారెడ్డి విగతజీవిగా కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య పిచ్చమ్మ, ఇద్దరు కొడుకులున్నారు.

నవ్వినందుకు ఇంటిపై దాడి

● కంతేరులో ఇరువర్గాల వివాదం
● పోలీసులపై వైసీపీ ఎంపీటీసీ దురుసు ప్రవర్తన

తాడికొండ(కంతేరు)ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో చదువుకునే విద్యార్థుల మధ్య జరిగిన గొడవ.. ఇరువర్గాల మధ్య వివాదానికి కారణమైంది. పాఠశాలలో దళిత సామాజికి వర్గానికి చెందిన విద్యార్థులు కొట్టుకోవడంతో వారిని చూసి నవ్వాడనే కారణంతో మరో సామాజికి వర్గానికి చెందిన విద్యార్థి ఇంటిపైకి దాడి చేసిన ఘటన తాడికొండ మండలం కంతేరు గ్రామంలో



పోలీసులపై దురుసుగా మాట్లాడుతున్న వైసీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పన

శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు.. మరో వర్గానికి చెందిన వారి ఇంటిలో మహిళను, ఆమె కొడుకుపై దాడి చేసి, దుర్భాషలాడి చంపేస్తామని హెచ్చరించారు. ఇరువర్గాల మధ్య వివాదం జరుగుతున్న విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వారిని పంపించి వేశారు. దళిత వర్గానికి చెందిన యువకులపై అకారణంగా మరోవర్గం దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, వైసీపీ ఎంపీటీసీ వలపర్ల కల్పన దళిత సంఘాలతో కలిసి శనివారం మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో పాటు పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. విషయం తెలుసుకున్న సీఐ వాసు స్టేషన్‌కు చేరుకొని వారితో మాట్లాడారు. ఫిర్యాదు ఇవ్వకుండా కేసు నమోదు ఎలా చెస్తామని సీఐ ప్రశ్నించారు. అనంతరం వారు దళిత సంఘాల నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. రెండవ వర్గానికి చెందిన మహిళ తనపై దాడి చేసి, అసభ్యంగా ప్రవర్తించారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130, 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


రోడ్లపై వ్యాపారం చేస్తున్న వారితో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

ట్రాఫిక్‌కు అడ్డంగా ఉండే వ్యాపారాలు తొలగించండి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లపై వ్యాపారాలు చేసుకుంటూ ట్రాఫిక్‌కి అడ్డంకిగా ఉండే వాటిని తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులు, కార్యదర్శులను ఆదేశించారు. శనివారం కమిషనర్ నెహ్రూనగర్, రాజీవ్ గాంధీ నగర్, సంజీవయ్య నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య, అభివృద్ధి పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన రోడ్ల పక్కన, డ్రెయిన్లను ఆక్రమించుకొని ట్రాఫిక్‌కి అడ్డంకిగా వ్యాపారాలు చేసుకునే వాటిని తొలగించాలన్నారు. నెహ్రూ నగర్‌లో నిర్మాణం చేసిన సీసీ రోడ్డుని పరిశీలించి పనులు జరిగే సమయంలోనే కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఎమినిటి కార్యదర్శులు, ఏఈలు పర్యవేక్షణ చేయాలన్నారు. పర్యటనలో ఐజాక్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు రోడ్ల మీద, డ్రెయిన్లలో వేయరాదు

నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను రోడ్ల పక్కన, డ్రెయిన్లలో వేయడానికి వీలులేదని, అలా వేసే ట్యాంకర్లను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు స్పష్టం చేశారు. కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలోని సెప్టిక్ ట్యాంకర్ల యజమానులు, కాంట్రాక్టర్లతో శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఎస్ఈ మాట్లాడుతూ నగరంలోని సెప్టిక్ ట్యాంకర్లు తప్పనిసరిగా సుద్దపల్లి డొంకలోని నగరపాలక సంస్థ ఎఫ్ఎస్టీపికే వ్యర్థాలను తరలించాలని, అక్కడ శాస్త్రీయ పద్ధతిలో నిర్వహణ చేయడం జరుగుతుందన్నారు. నగరపాలక సంస్థ తరుఫున ప్రత్యేక రిజిస్ట్రేషన్ చేస్తామని, రిజిస్ట్రేషన్ లేకుండా ఉండే వాహనాలను సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం మాట్లాడుతూ సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను ఆరుబయట వదలడం ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదమన్నారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ నాగభూషణం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు అవకాశం కల్పించండి

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షకు అవకాశం కల్పించాలని బోయపాలెం, డైట్ కళాశాలకు చెందిన 2023-25 బ్యాచ్ విద్యార్థినులు డీఆర్వో ఖాజావలీకి వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం ప్రాక్టికల్ పరీక్షలు ముగిసాయని, నాలుగవ సెమిస్టర్ పరీక్షలు మే15న జరుగుతాయని, ఫలితాలు జూన్ చివరి నెలలో వస్తాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని డీఎస్సీ పరీక్షకు అర్హత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.


కలెక్టరేట్‌కు వచ్చిన విద్యార్థినులు

విజ్ఞాన్ నిరుల విద్యార్థినికి కీ బోర్డు ప్లేలో గిన్నీస్ రికార్డు


విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక తదితరులు

గుంటూరు విద్య ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ నిరుల కళాశాలలోని ఈసీఈ విభాగంలో ద్వితీయ సంవత్సరం బీటెక్ చదువుతున్న వై.నయనశ్రీకి పియానో (కీబోర్డ్) ప్లే లో గిన్నీస్ రికార్డు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీని ఆన్‌లైన్ మాధ్యమంలో నిర్వహించగా 18 దేశాలకు చెందిన పియానో వాద్యకారులు పాల్గొన్నారని, వారిలో నయనశ్రీ కేవలం 41 సెకండ్లలో మూడు సరళీ స్వరాలు వాయించినందుకు తనకు ఈ అరుదైన రికార్డు లభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.సంధ్య, అధ్యాపకులు, సహ విద్యార్థినులు అభినందనలు తెలిపారు.

కొరిటెపాడు చెరువులో పక్షుల కోసం గూళ్లు

గుంటూరు కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పక్షుల కోసం స్థానిక కొరిటెపాడు చెరువు ట్రాక్‌లో ప్రత్యేకంగా గూళ్లను ఏర్పాటు చేశారు. చెట్టు మీద గుడు.. చెట్టు కింద నీరు, ఆహారం అనే కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నాగిరెడ్డి సౌజన్యంతో వాకింగ్ ట్రాక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాక్‌పై గూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు కొరిటెపాడు వాకింగ్‌ట్రాక్ అసోసియేషన్ అధ్యక్షుడు కన్నసాని బాజీ తెలిపారు. ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందన్నారు. కవి జయరాజు మాట్లాడుతూ ప్రకృతిలోని జీవ రాశులను పుడమి తల్లిని కాపాడటం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో యోగ గురువులు సభాపతి, ధర్మారెడ్డి, ట్రాక్ అసోసియేషన్ సెక్రటరి శివరామకృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఇమడాబత్తిని కోటేశ్వరరావు, యేళ్ల రత్తయ్య, వాకర్స్ సింగంశెట్టి కోటేశ్వరరావు, కందుల వెంకయ్య, దాసరి శ్రీనివాసరావు, శ్యామల కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పక్షుల కోసం గూళ్లను కడుతున్న అధ్యక్ష, ఉపాధ్యక్షులు బాజీ, కోటేశ్వరరావు తదితరులు

జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కు ముందు, వెనక జనరల్ బోగీలు

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నిత్యం గుంటూరు మీదగా లింగంపల్లి-విశాఖపట్టణం మధ్య రాకపోకలు సాగించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌కి జనరల్ బోగీల కంపోజిషన్‌ని మార్చారు. ఇప్పటివరకు జనరల్ బోగీలన్ని రైలు ముందు/వెనక భాగంలో ఉండేవి. దీని వలన పలు సందర్భాల్లో అవి ముందున్నాయా... వెనక ఉన్నాయా తెలియక ప్రయాణీకులు ఇబ్బందులు పడుతుండేవారు. ఈ నేపథ్యంలో జెడ్ఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు ఉప్పలూరి శశిధర్‌చౌదరి ఈ విషయాన్ని ఈస్టు కోస్టు రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తూర్పు కోస్తా రైల్వే స్పందించి ఈనెల 26వ తేదీ నుంచి కోచ్ కంపోజిషన్‌ని మారుస్తున్నట్లు ప్రకటించింది. ఆ రోజు నుంచి ముందు మూడు, వెనక మూడు జనరల్ భోగీలుంటాయి. మధ్యలో సెకండ్ సిట్టింగ్, ఛైర్‌కార్, త్రీటైర్ బోగీలుంటాయి. దీనివలన ప్రయాణీకులకు ఇబ్బందులు తగ్గుతాయి.

ఉగ్ర దాడిపై పాకిస్థాన్ మూల్యం చెల్లించక తప్పదు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మాధవి, కోవెలమూడి రవీంద్ర, దేగల ప్రభాకర్

గుంటూరు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): భారతదేశంలో అమాయకపు ప్రజలపై పాకిస్థాన్ ముష్కరులు సాగించిన దమనకాండకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి హెచ్చరించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం నుంచి శనివారం ఆమె నేతృత్వంలో నగరంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రదాడులకు వ్యతిరేకంగా, చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ నిర్వహించిన ఈ ర్యాలీలో ఏపీఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ, టీడీపీ ఆర్-5 ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ విద్వేషాలు రెచ్చకొట్టి ఉగ్రవాద దాడులకు పాల్పడే వారిపై భారత దేశం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఉగ్రవాద దాడులలో మృతి చెందిన వారి కుటుంబాలకు దేశం మొత్తం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మత విద్వేషాలు రెచ్చకొట్టి లబ్ధిపొందాలని చూసే ఉగ్రవాద సంస్థలకు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని డేగల ప్రభాకర్, మన్నవ మోహనకృష్ణ, కోవెలమూడి రవీంద్రలు హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కమ్మజన సేవ సమితి ఆవరణలో నిరసన ప్రదర్శన

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ మృతులకు సంతాపం తెలుపుతూ శనివారం స్థానిక బృందావన్‌గార్డెన్స్, కమ్మజన సేవ సమితి ఆవరణలో నిరసన ప్రదర్శన జరిగింది. అనంతరం వసతి గృహం నుంచి పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు మాట్లాడుతూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి కుట్రపూరితమన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు వడ్లమూడి నాగేంద్రం, గోరంట్ల పున్నయ్య చౌదరి, మర్రిపూడి సీతారామయ్య, వంకాయలపాటి బలరామకృష్ణయ్య, వడ్లమూడి శివరామకృష్ణయ్య, కన్నెగంటి బుచ్చయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు....

కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ మృతులకు సంతాపం తెలుపుతూ శనివారం కలెక్టరేట్ ఎదుట ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. వారు మాట్లాడుతూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి పిరికిపంద చర్య అని మండిపడ్డారు. దేశంలో మత చిచ్చు పెట్టాలని చూస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ పరమేశ్వరరెడ్డి, ఉమామహేశ్వరరావు, సాగర్, కైలాసనాథ్, రాంబాబు, చలపతిరావు, సుబ్బాయమ్మ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.


కమ్మ బాలికల వసతి గృహంలో కొవ్వొత్తులతో సంతాపం తెలుపుతున్న విద్యార్థినులు, పాలకవర్గ సభ్యులు



కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లిం వర్గాలకు న్యాయం

● బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ముస్లిం వర్గాలకు న్యాయం చేసేందుకే వక్ఫ్ సవరణ బిల్లు కేంద్రం తీసుకువచ్చిందని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. స్థానిక లాల్‌పురంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ ద్వారా పేద ముస్లింలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ముస్లిం, మైనారిటీలకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో 22 మంది ఎంపీలు ఉన్నా వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలపక పోవడమే ప్రజలు వైసీపీని తిప్పి కొట్టారని అన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ అనేది ఇస్లామిక్ చట్టం ప్రకారం ఇవ్వబడిన తిరిగి ఇవ్వలేని దాతృత్వ నిధి అని అన్నారు. వక్ఫ్ చట్టంపై అవగాహన కల్పించేందుకు సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, కార్యక్రమ కన్వీనర్ చరక కుమార్ గౌడ్, షేక్ అబ్దుల్ ఖుద్దుస్, షేక్ రఫీ, మైనార్టీ మోర్చ జిల్లా అధ్యక్షులు నరేంద్ర షా, జిల్లా ప్రధాన కార్యదర్శులు షేక్ సాంబశివరావు, గౌస్ పీరా, షేక్ బిలాల్, షేక్ ఫరా నా, అవంతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షేక్ బాజీ, పాల్గొన్న తిరుపతిరావు తదితరులు

మస్తానయ్యకు అభినందనలు


మస్తానయ్యను సత్కరించి అభినందిస్తున్న రామరాజు శ్రీనివాస్, లక్ష్మీ శ్రీనివాస్

గుంటూరు, ఏప్రిల్ 26(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవల కళారత్న హంస పురస్కారం పొందిన బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన కమిటీ ఛైర్మన్ సిహెచ్ మస్తానయ్య ను రామరాజు ఫౌండేషన్ ఛైర్మన్, ప్రముఖ ఆడిటర్ రామరాజు శ్రీనివాస్ రావు, ప్రముఖ వీణ విద్వాంసురాలు రామరాజు లక్ష్మీశ్రీనివాస్‌లు అభినందనలు తెలియజేశారు. ఆలయ ప్రాంగణంలో శనివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో మస్తానయ్యను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి ఉమా మహేశ్వర రావు ఉన్నారు.

జేకేసీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి పరిధిలోని కరకట్ట వద్ద ఉన్న ఓ రిసార్ట్‌లో గుంటూరు జేకేసీ కళాశాల 1989-94 బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేకేసీ కళాశాల రిటైర్డ్ ఇంగ్లీషు లెక్చరర్ నర్రా నాగేశ్వరరావు హాజరై ఇటువంటి సమ్మేళనాలు జీవితకాలాన్ని పెంచుతాయని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని చదువుకున్న రోజుల్లోని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకునేందుకు ఇదో వేదిక అని చెప్పా రు. మరో రిటైర్డ్ లెక్చరర్ సాంబశివరావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యా న్ని కాపాడుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా యోగా, ధ్యానం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా అలనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏలూరు సీటీవో కోటేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ గడ్డిపాటి అనిల్‌కుమార్, పతంజలి రాష్ట్ర స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు కాలారి నరసింహారావు, సురేష్, అమెరికన్ బ్లూక్రాఫ్ట్ ఈడీ రఘు, భీమినేని వెంకటేశ్వరరావు, పిఎఫ్ వెంకటేశ్వరరావు, నాగుల్‌మీరా, చైతన్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీలత, అరుణ, స్వాతి, ముప్పా శ్రీను, ప్రసాద్, హైమా తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థులు

అలరించిన నృత్యాభినయనం


కూచిపూడిని ప్రదర్శిస్తున్న జేపీ కనిష్క

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై జరుగుతున్న మహామంజీర నాదం నృత్యోత్సవం ప్రేక్షకులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు ప్రారంభించగా, సభకు సంస్థ అధ్యక్షుడు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. సభలో వీవీఐటీ విద్యాసంస్థల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, నాట్యాచార్య డాక్టర్ కాజా వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని కళాకారులను ఘనంగా సత్కరించారు. సభానంతరం కర్ణాటకకు చెందిన సుమంగళ ప్రభు భరతనాట్యాన్ని, హైదరాబాదుకు చెందిన జేపీ కనిష్క కూచిపూడి నృత్యాన్ని, కోల్‌కత్తాకు చెందిన దేబ్ జనిబను కథక్ నృత్యాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంశలు అందుకున్నారు.

బాధితులకు చెక్కులు పంపిణీ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇన్నర్ రింగ్ రోడ్డు త్రీ ఫేజ్ విస్తరణలో భాగంగా నివాసాలు కోల్పోయిన వారికి స్థానిక విద్యానగర్‌లోని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. తొలి విడతలో భాగంగా 30 మందికి రూ.24 లక్షల విలువ కలిగిన చెక్కులను పంపిణీ చేశారు. దీంతో పాటు ప్రభుత్వ స్థలంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఎమ్మెల్యే సొంత నిధుల నుంచి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున అందజేశారు. నగరపాలక సంస్థ ప్రణాళికాధికారి రాంబాబు మాట్లాడుతూ మిగిలిన వారికి సోమవారం రోజున చెక్కులను అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కల్లూరు శ్రీనివాసరావు ఐటీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచుమర్తి శేషు, 41, 46 డివిజన్ల కార్పొరేటర్లు బొడ్డుపల్లి స్మిత పద్మజ, నూకవరపు బాలాజీ, ప్రత్తిపాడు మార్కెట్ ఛైర్మన్ బొందలపాటి ఉమా, కూటమి నాయకులు గంధం సురేష్, బేతా సౌరి, నాగరాజు, కిరణ్, గణేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నివాసాలు కోల్పోయిన వారికి చెక్కులను పంపిణీ చేస్తున్న కూటమి నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ కళాశాలల నిర్వహణ

● ఆర్ఐఓకు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు


ఇంటర్ బోర్డు ఆర్ఐఓ జుబేర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కళాశాలలు నడిపే ప్రైవేట్ కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆర్ఐఓ జుబేర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ ఏప్రిల్ 23 నుంచి రాష్ట్ర ప్రభుత్వం కాలేజిలకు సెలవులు ప్రకటించిందని, కాని కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలను నడుపుతూ ఎంతో మంది విద్యార్థులను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పుడే పాఠ్యాంశాలు బోధిస్తున్నామని రాకపోతే తిరిగి బోధించమని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, నగర కార్యదర్శి యశ్వంత్, నగర ఉపాధ్యక్షులు సౌమ్య, సుభాని తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నసీర్

అభివృద్ధిలో గుంటూరు తూర్పు నియోజకవర్గం

● ఎమ్మెల్యే నసీర్ ● బైక్‌పై వార్డుల పర్యటనకు శ్రీకారం

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి రోజూ ఉదయాన్నే ఆయన డివిజన్ పర్యటనలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం ఐపీడీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీ, సాయికృష్ణ నగర్, బావాజీ నగర్ ప్రాంతాల్లో బైక్‌పై పర్యటించారు. ఇప్పటి వరకు ఆయా ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. మురుగు కాలవల పరిస్థితి, పారిశుధ్యం, తాగునీటి సరఫరాలో తలెత్తే లోపాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏ చిన్న సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల నిధుల సహకారంతో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టామని తెలిపారు. వీటితోపాటు పార్కులు, వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూర్య శీను, గురవయ్య, మల్లంపూడి శ్రీనివాస్, రాధంశెట్టి జగన్, పుట్టగండి వెంకటేశ్వర్లు, పాటిబండ్ల శ్రీనివాసరావు, గోగినేని హరి, కోటేశ్వరరావు, మస్తాన్ వలి, చెన్నుపాటి రాజశేఖర్, మీరావలి, సూరం లక్ష్మి పాల్గొన్నారు.

చెత్త రహిత నగరమే లక్ష్యం

నగరాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తూర్పు నియోజకవర్గంలో గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ తెలి పారు. పొన్నూరు రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద రూ.3.60 కోట్లతో గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్ ఏర్పాటుకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి రోజూ 160 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే గార్బేజ్ ట్రాన్సిట్ స్టేషన్ ఏర్పాటుకు సంబంధించి యంత్ర పరికరాలు వచ్చాయని, సివిల్ ఇంజనీరింగ్ వర్క్స్ పూర్తయ్యాయని వివరించారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత జాతి గుండె చప్పుడు

● వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

● వేడుకగా జై భీమ్ జనగానం అంబేడ్కర్ పాటల పండుగ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత జాతి గుండె చప్పుడు అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కొనియాడారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం జాషువా కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు పివి రమణ అధ్యక్షతన జై భీమ్ జనగానం- అంబేడ్కర్ పాటల పండుగ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన నక్కా ఆనంద్‌బాబు మాట్లాడుతూ జాషువా కల్చరల్ సెంటర్ ద్వారా అంబేడ్కర్‌కు పాటల పట్టాభిషేకం చేయటం అభినందనీయమని అన్నారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని అప్పుడే అంబేడ్కర్ ఆశయాలు భవిష్యత్తు తరాలకు అందజేయగలుగుతామని అన్నారు. అనంతరం జాగోరే జాగోరే అంబేడ్కర్ లాంటి పాటలతో అలరించిన ప్రజా సాంస్కృతిక గాయకులు జయరాజ్, అంబేడ్కర్, పూలే కళారూపకాలను ప్రదర్శనలు ఇచ్చిన కే దేవేందర్‌లను "భీమ్ కళాజ్యోతి" పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బహుజన నాయకులు పల్లె నరసింహ, నూకతోటి శరత్ బాబు, ఆర్ రాజేష్, ఉదయ భాస్కర్, లెనినా, సత్య జయరామ్, సోమన్న, కిన్నర్ యాదగిరి, అంజన్న, విప్లవ కుమార్ తదితరులు అంబేడ్కర్ గీతాలను ఆలపించారు. తొలుత సంస్కృతి వ్యవస్థాపకుడు సర్రాజు బాలచందర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు మద్దిరాల మ్యానీ, జాషువా కల్చరల్ సభ్యులు బాలస్వామి, పోలే ముత్యం, విద్యాసాగర్, కాళిదాసు, వినయ్‌కుమార్, గోళ్ల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాలు అందుకున్న జయరాజ్, దేవేందర్‌తో నక్కా ఆనందబాబు, మ్యానీ తదితరులు

నేటి నుంచి అమ్మవారి వార్షిక మహోత్సవాలు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక శారదా కాలనీ, 7వ లైన్లో కొలువైన శ్రీ మహాలక్ష్మి అమ్మవారి 31వ వార్షిక మహోత్సవాలు ఆదివారం నుంచి మే 1వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 27న సుప్రభాత సేవ, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, 28న మల్లెపూలతో సహస్ర నామాలతో పూజ, 29న శ్రీదేవి ఖడ్గమాల స్తోత్రం, కోలాటం, 30న రథోత్సవం, మే 1న అన్నదాన వితరణ, అమ్మవారి లడ్డు వేలం పాట జరుగుతాయని వివరించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

తొలగించారని.. కత్తిరిస్తున్నారు!

ఏపీ ఫైబర్ నెట్ సంస్థ మాజీ ఉద్యోగుల చర్యలతో.. తమకు తిప్పలు తప్పడం లేదని కేబుల్ ఆపరేటర్లు ఆరోపిస్తున్నారు. సంస్థ నుంచి తొలగించారనే ఆక్రోశంతో కొందరు ఉద్యోగులు కేబుల్ వైర్లను తరచూ కత్తిరించడం.. తమకు తలనొప్పిగా మారిందని వాపోతున్నారు. ప్రసారాల అంతరాయంతో.. వినియోగదారుల నుంచి ఒత్తిడి అధికమైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తామే స్వయంగా మరమ్మతులు చేపడుతున్నప్పటికీ.. మళ్లీ మళ్లీ ఇలాంటి దుశ్చర్యలకు ఉద్యోగులు పాల్పడడం ఏంటని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ చర్యలతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని..ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తున్నారు.

- ఏపీ ఫైబర్ నెట్ కేబుల్ వైర్ల కత్తిరింపు
- సంస్థ మాజీ ఉద్యోగుల పనేనని ఆపరేటర్ల ఆరోపణ
- మరమ్మతులు చేపట్టినా మళ్లీ మళ్లీ అవే దుశ్చర్యలు
- వినియోగదారుల నుంచి ఒత్తిడి, ఆర్థిక నష్టం అంటూ ఆందోళన
- సంస్థ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- సీఎం దృష్టి సారించి పరిష్కరించాలంటూ వేడుకోలు

అమృతలూరు, ఏప్రిల్, 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫైబర్ నెట్ ప్రసారాల అంతరాయానికి ప్రధాన కారణం సంస్థ నుంచి తొలగించిన సిబ్బందే కారణమని కేబుల్ ఆపరేటర్లు ఆరోపిస్తున్నారు. సంస్థలో పని చేసిన అనుభవంతో ఏ కేబుల్ ఎటు వెళ్తుందో.. వారికి కొట్టిన పిండి అని, తమను విధుల నుంచి తొలగించారన్న ఆక్రోశంతో సిబ్బంది వైర్లు కత్తిరిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో రూ. లక్షలు పెట్టుబడి పెట్టి వినియోగదారులకు ప్రసారాలు అందిస్తున్న తాము.. నెల రోజులుగా ప్రసారాల్లో అంతరాయాలు ఏర్పడుతుండటంతో వినియోగదారుల నుంచి ఒత్తిడి తట్టుకోలేకపోతున్నామని కేబుల్ ఆపరేటర్లు వాపోతున్నారు.

పైగా తామే సంఘటితంగా తెగిపోయిన వైర్లను పునరుద్ధరిస్తున్నప్పటికీ మళ్లీమళ్లీ వైర్ల కత్తిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు. బాపట్ల, గుంటూరు జిల్లాల్లో బుధ, గురు వారాలు కత్తిరింపులకు గురైన ఏపీఎస్ ఎఫ్ఎల్ కేబుల్స్‌ను ఆయా పరిధిలోని కేబుల్ ఆపరేటర్లు సరిచేసి ప్రసారాలను పునరుద్ధరించారు. యథావిధిగా ప్రసారాలను వస్తున్నట్లు తెలుసుకున్న అగంతకులు చెరుకుపల్లి, కర్లపాలెం మధ్యన శుక్రవారం మధ్యాహ్నం వైర్లను కత్తిరించారు. తెనాలి నుంచి ప్రసారాలు ఈ కత్తిరింపులు వల్ల నిలిచిపోలేదుని గ్రహించిన దుండగులు.. తెనాలి సబ్ స్టేషన్ నుంచి వస్తున్న వైర్లను కూడా సాయంత్రం 6.30 గంటల మధ్యలో కత్తిరించారు. దీంతో వేమూరు, రేపల్లె, చెరుకుపల్లి, నిజాంపట్నం, అమృతలూరు, చుండూరు తదితర మండలాలకు ప్రసారాలు నిలిచిపోయాయి. దీంతో మళ్లీ కేబుల్ ఆపరేటర్లు అర్థరాత్రి శనివారం తెల్లవారుజాము వరకు కష్టించి ప్రసారాలను పునరుద్ధరించారు.



అర్ధరాత్రి తెగిన ఏపీ ఎస్ఎఫ్ఎల్ వైర్లను స్ప్లైసింగ్ చేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

సంస్థ తొలగిస్తే ఆపరేటర్లను ఇబ్బంది పెడతారా?

ఏపీఎస్ఎఫ్ఎల్‌లో అక్రమాలకు పాల్పడిన సిబ్బందిని ఆ సంస్థ తొలగిస్తే.. తమను ఇబ్బంది పెట్టడం ఏంటని కేబుల్ ఆపరేటర్ల ప్రశ్నిస్తున్నారు. తొలగించిన సిబ్బందికి సంస్థ బకాయి ఉంటే.. ఆ సొమ్మును రాబట్టుకునేందుకు ప్రసారాలు అంతరాయం కలిగించడం సబబు కాదని అంటున్నారు. కేబుల్ కత్తిరింపులకు పాల్పడే వారిని గుర్తించేందుకు ఆపరేటర్లు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సీసీ కెమెరాలు డేటా సేకరణతో పాటు నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెబుతు న్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రసారాల్లో అంతరాయాలు

సిబ్బంది తొలగింపు కారణంగానే.. ఏపీఎస్ఎఫ్ఎల్ ప్రసారాల్లో రాష్ట్రవ్యాప్తంగా అంతరాయం ఏర్పడుతున్నట్లుగా ఆయా జిల్లాల ఆపరేటర్లు ఏపీఎఫ్‌వోఎఫ్‌కు ఫిర్యాదు చేస్తున్నారు. ఆపరేటర్ల సంఘం విజయవాడలోని సంస్థ కార్యాలయానికి వెళ్లి ఉన్న అధికారులతో తమ సమస్య లను చర్చించినట్లు తెలుస్తోంది. అయితే గత వారం వేమూరు, భట్టిప్రోలు, చెరుకుపల్లి మండలాల ఆపరేటర్లు కొంతమంది ఇదే సమస్యపై ప్రధాన కార్యాలయానికి వెళ్లి ఏకరువు పెట్టగా అక్కడ ఉన్న సిబ్బంది చేతులెత్తేశారని చెబుతున్నారు. మరో నాలుగైదు నెలల వరకు ఆపరేటర్లు సిగ్నల్స్‌లో అం తరాయాలు లేకుండా చూసుకోవాలని చెబుతున్నారని తెలిపారు. సంస్థ సిబ్బందిని నియమించుకునే వరకు ఈ తిప్పలు తప్పవని అంటున్నారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మానస పుత్రిక ఏపీఎస్ఎఫ్ఎల్ సంస్థ గత వైసీపీ ప్రభుత్వ ప్రారంభం నుంచి ప్రాభవం కోల్పోయింది. కూటమి ప్రభుత్వంలో సంస్థకు పునరుత్తేజం అందిస్తారని ఆ శించిన ఆపరేటర్లు తాజా పరిణామాలతో.. అసలు సంస్థ మనుగడకే ముప్పు వాటిల్లుతుందని ఆందోళ న వ్యక్తం చేస్తున్నారు. సీఎం మరోసారి దృష్టి సారించి సంస్థను గాడిలో పెట్టాలని కోరుతున్నారు.

ముగిసిన జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 18 నుంచి ప్రారంభమైన జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారంతో ముగిశాయి. సీనియర్స్ విభాగంలో జరిగిన పోటీల్లో నంద్యాలకు చెందిన సిరివెళ్ల గుంపుంమాదిన్నె గ్రామానికి చెందిన కుందుల రాంగోపాల్‌రెడ్డి, పాణ్యం ఎస్.కొత్తూరుకు చెందిన సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎడ్లు 3,994 అడుగులు లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. నంద్యాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, ఏఎస్‌పీ సుంకి సాకేత్‌రెడ్డి, సారికారెడ్డికి చెందిన ఎడ్లు 3,939 అడుగులు లాగి 2వ బహుమతి పొందాయి. ప్రకాశం జిల్లా టంగుటూరు, కృష్ణాజిల్లాకు చెందిన మేకా కృష్ణమోహన్, మక్కెన కోటేశ్వరరావులకు చెందిన ఎడ్లు 3,566 అడుగులు లాగి 3వ బహుమతి, బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోటి శిరిషా చౌదరి, శివకృష్ణచౌదరి, గుంటూరుజిల్లా తాడేపల్లికి చెందిన లంకిరెడ్డి నిక్షత్‌రెడ్డికి చెందిన ఎడ్లు 4వ బహుమతి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలశౌరిపాలెంకు చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితాచౌదరి ఎడ్లు 3,176 అడుగులు లాగి 5వ స్థానం కైవసం చేసుకున్నాయి. విజేతలకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.1.25లక్షలు, 2వ బహుమతి రూ. లక్ష, 3వ బహుమతి రూ.75వేలును ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు విరాళంగా అందజేశారు. 4వ బహుమతి రూ.65వేలును మురళీకృష్ణ గొర్రెల మండి కో-ఆపరేటివ్ సొసైటీ, 5వ బహుమతి రూ.55వేలు మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, ఏనుగుపాలెం సర్పంచ్ మాదినేని ఆంజనేయులు అందజేశారు. పట్టణ సీఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు, నిర్వాహకులు మక్కెన వెంకట్రావు, అనుమోలు సుబ్బారెడ్డి, మాదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గారెడ్డి, అక్కిరెడ్డి, గురువారెడ్డి, కుంటా కోటిరెడ్డి, తిప్పిరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినుకొండ : మొదటి బహుమతిని కైవసం చేసుకున్న నంద్యాల జిల్లా ఎడ్లు

దాచేపల్లిలో ఉత్సాహంగా..

దాచేపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి శ్రీ వీర్లంకమ్మ తల్లి ఆలయం 25వ వార్షికోత్సవం సందర్భంగా జరుగుతున్న ఎడ్ల బల ప్రదర్శనలో శుక్రవారం పాల పళ్ల విభాగంలో పోటీలు నిర్వ హించారు. అమరావతి మండలం గిడుగు గ్రామా నికి చెందిన భూతి శ్రీనివాస్, నోసాయపేటకు చెందిన గౌరు కార్తికేయ ఎడ్ల జత 4,250 అడు గులు దూరం లాగి బండ లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండవ స్థానంలో మాచవరం మండలంలో మోర్జంపాడుకు చెందిన కొర్రి గంగారాజు యాదవ్ ఎడ్ల జత 3,609, మూడవ స్థానంలో ఫిరంగిపురం మండలం కండ్రికకు చెందిన కేలం పద్మ నాయుడు ఎడ్ల జత 3,580, బాపట్ల జిల్లా పాండు రంగాపురానికి చెందిన కె.ఏడుకొండలరెడ్డి ఎడ్ల జత 3,500, ఐదవ స్థానంలో పల్నాడు జిల్లా ముప్పాళ్ళ మండలం మాదలకు చెందిన యర్రంశెట్టి సుబ్బారావు ఎడ్ల జత, దాచేపల్లి గ్రామానికి చెందిన యామర్తి శైలేంద్ర 3,103 అడుగుల దూరం లాగి 6వ స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతి రూ.20 వేలను రామిశెట్టి వెంకటేశ్వర్లు, ఉడుముల కొండారెడ్డి, రెండవ బహుమతి రూ.15వేలు సలాం మేస్త్రి, కేసానుపల్లి జానయ్య, 3వ బహుమతి రూ.10వేలు కొప్పుల వెంకటేశ్వర్లు, గురజాల మల్లిఖార్జునరావు, నాల్గవ ప్రైజ్ రూ.8 వేలు యలమల రామ కోటయ్య, కుమారుడు వెంకటేశ్వర్లు నాగయ్య, 5వ ప్రైజ్ రూ.7వేలు గణితి అమరయ్య మామ చిమటా నాగేశ్వరరావు, 6వ ప్రైజ్ రూ.5వేలు కొప్పుల సీతారామయ్య విజేతలకు నగదుతో పాటు షీల్డ్ కూడా అందజేశారు. కాగా శనివారం జత పళ్ల విభాగంలో 20కి పైగా ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి.

పోలీసుల అదుపులో బంగ్లాదేశీయుడు

- క్యాన్సర్ రోగికి సహాయకుడిగా వీసా తీసుకొని వ్యాపార కార్యకలాపాలు
- ఈ నెల 17న రోడ్డు మార్గంలో భారత్‌లోకి ప్రవేశం
- 21న గుంటూరుకు.. దుగ్గిరాలలో పసుపు కొనుగోలు
- లాడ్జిలు, హోటళ్ల తనిఖీల్లో బయటపడిన వ్యవహారం

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వీసా నిబంధనలకు విరుద్ధంగా గుంటూరులో ఉన్న బంగ్లాదేశీయుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల కశ్మీరులోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తం కావడమే కాకుండా విదేశీయుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ఉగ్రదాడితో పాటు వచ్చే నెల 2న ఏపీ రాజధానిలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్న విషయం తెలిసిందే. దీంతో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. డీజీపీ హరీష్ కుమార్ గుప్త ఆదేశాల మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సాయంత్రం నాలుగు నుంచి ఆరు గంటల మధ్య లాడ్జిలు, హోటల్లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. దీనిలో భాగంగా గుంటూరు నగరంలోనూ హోటళ్లు, లాడ్జిలను పోలీసులు జల్లెడ పట్టారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మస్తాన్ దర్గా ఎదురుగా ఉన్న సౌత్ ఇన్ హోటల్‌లో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించిన సందర్భంగా అనుమానాస్పదంగా ఉన్న బంగ్లాదేశీయుడిని అదుపులో తీసుకుని, విచారించారు. అతనితోపాటు మరికొందరు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన వారు కూడా ఉన్నారు. బంగ్లాదేశీయుడు రషీద్ (45)ను విచారించగా ఆయన వద్ద పాస్‌పోర్ట్, వీసా ఉన్నాయి. అయితే వీసా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలింది. అతను భారత్ నుంచి పసుపు, మిర్చి, ఉల్లిపాయలు వంటి వాటిని ఎగుమతి వ్యాపారం చేస్తుంటాడు. గతంలో నాలుగైదు సార్లు వ్యాపార కార్యకలాపాల నిమిత్తం భారత్‌కు వచ్చి వెళ్లాడు. ఇదే తరహాలో గతంలో రెండుసార్లు గుంటూరుకు వచ్చి వెళ్లాడు. బంగ్లాదేశ్‌కు చెందిన క్యాన్సర్ రోగికి సహాయకుడిగా వైద్య సేవల కోసం వస్తున్నట్లు వీసా తీసుకున్నాడు. చెన్నైలోని వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో క్యాన్సర్ రోగికి వైద్యం చేయించాలని వీసా తీసుకొని.. ఈ నెల 17న రోడ్డు మార్గం ద్వారా రషీద్ భారత్‌లోకి ప్రవేశించాడు. అయితే అతనితో రోగి వచ్చారా లేదా అనేది తెలియరాలేదు. దీనిపై పోలీసు అధికారులు రషీద్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు వచ్చి అక్కడ నుంచి కొందరు పసుపు వ్యాపారులను వెంటబెట్టుకొని ఈ నెల 21న గుంటూరు వచ్చాడు. వీసా నిబంధనల ప్రకారం ఆయన జిల్లాలోకి అడుగు పెట్టిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలి. అదే విధంగా ఆయన ఎక్కడైతే లాడ్జిలో బస చేస్తారో, స్థానిక పోలీస్ స్టేషన్‌లో కూడా సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే రషీద్ ఇప్పటి వరకు స్పెషల్ బ్రాంచ్‌లో గాని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గాని సమాచారం ఇవ్వలేదు. కనీసం హోటల్ నిర్వాహకులు కూడా పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. రషీద్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన వ్యాపారులతో కలిసి గుంటూరు జిల్లాలోని దుగ్గిరాలలో గల పసుపు యార్డుకు వెళ్లి పసుపు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అలాగే గతంలో కర్నూలు వెళ్లి ఉల్లిపాయలు కూడా కొనుగోలు చేసి ఎగుమతి చేసినట్లు విచారణలో తేలింది. పసుపు సీజన్ ముగుస్తున్న నేపథ్యంలో మెడికల్ గ్రౌండ్స్‌లో అయితే త్వరగా వీసా వస్తుందనే ఉద్దేశంతో క్యాన్సర్ రోగికి సహాయకుడిగా వీసా తీసుకున్నట్లు రషీద్ చెప్పినట్లు తెలిసింది.

రషీద్ వ్యవహారంతో అప్రమత్తమైన నిఘావర్గాలు

ఒకవైపు కాశ్మీర్లో ఉగ్రదాడి.. మరోవైపు వచ్చేనెల 2న రాజధాని ప్రాంతంలో ప్రధాని పర్యటన నేపథ్యంలో ఇప్పటికే నిఘా వర్గాలు అప్రమత్తమైన నేపథ్యంలో తాజాగా బంగ్లాదేశీయుడు పట్టుబడటం కలకలం రేపింది. ఇప్పటికే స్పెషల్ బ్రాంచ్ వర్గాలు జిల్లా వ్యాప్తంగా విదేశీయుల గురించిన వివరాలను తీస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలోకి అత్యధికమంది ఎడ్యుకేషన్ వీసాపై వచ్చిన వారే ఉన్నారు. జిల్లాలోని కేఎల్, విజ్ఞాన్ యూనివర్సిటీలలో విదేశాలకు చెందిన ఎంతో మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా యూనివర్సిటీలలో ఆఫ్రికా, నైజీరియా, సూడాన్, బంగ్లాదేశ్, ఇరాన్, ఇరాక్ తదితర దేశాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్నారు. దీంతో నిఘా వర్గాలు వారందరి వీసాలను పరిశీలిస్తున్నారు. జిల్లాలో సుమారు 389 మంది విద్యార్థులు ఎడ్యుకేషన్ వీసాపై వివిధ దేశాల నుంచి వచ్చి విద్యను అభ్యసిస్తున్నట్లుగా స్పెషల్‌బ్రాంచ్‌లో నమోదయింది. ఇప్పటికే పోలీసులు వారందరి వీసాలపై ఆరా తీస్తున్నారు. ఎడ్యుకేషన్ వీసాపై వచ్చి ఇతర కార్యకలాపాలు ఏమైనా చేస్తున్నారా అనే కోణంలోనూ విచారిస్తున్నారు. అయితే జిల్లాలో ఒక్కరు కూడా పాకిస్తానీయులు లేరని పోలీసు అధికారులు వెల్లడించారు. బంగ్లాదేశీయుడు రషీద్ భారత్‌లోకి కేవలం వ్యాపార దృష్టితోనే, అందులోనూ పాస్‌పోర్ట్, వీసాతోనే ప్రవేశించినప్పటికీ వచ్చిన పని కాకుండా మరో పని చేయడం, అంతేగాక ముందుగా సమాచారం ఇవ్వకపోవడాన్ని పోలీసులు తప్పుపడుతున్నారు.

స్థాయి దిగి.. దివ్యాంగునికి మంత్రి గౌరవం

తెనాలి రూరల్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు తగిన గౌరవం ఇస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్లమనోహర్ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. శనివారం తెనాలి జనసేన పార్టీ కార్యాలయానికి సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ఓ దివ్యాంగుడి వద్దకు మంత్రి వెళ్లి నేలపైకూర్చుని అతడి సమస్యను సావధానంగా ఆలకించారు. అంతే కాకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. మంత్రి నన్న భావన లేకుండా సాధారణ మనిషిగా దివ్యాంగుడికి తగిన గౌరవం ఇచ్చిన తీరు అందిరినీ ఆకట్టుకుంది.



దివ్యాంగుని సమస్యను నేలపై కూర్చుని తెలుసుకుంటున్న మంత్రి మనోహర్

15వ ఆర్థిక సంఘం నిధుల రాక

- ప్రధాని మోదీ పర్యటనకు ముందే కేంద్రం విడుదల
- ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ. 120 కోట్లకు పైగా వచ్చే అవకాశం
- 70 శాతం నిధులు గ్రామ పంచాయతీలకే

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు, మండల ప్రజాపరిషత్తులు, జిల్లా పరిషత్తు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేశాయి. ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే శుక్రవారం అమరావతి రాజధాని పర్యటనకు రానుండటంతో కేంద్ర ప్రభుత్వం ముందుగానే వరాల జల్లు కురిపించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలను విడుదల చేసింది. దాదాపుగా రాష్ట్రం మొత్తానికి రూ. 1121. 20 కోట్లు విడుదల చేయడంతో అందులో ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ. 120 కోట్లు పైగానే వస్తాయని పంచాయతీరాజ్ జిల్లా అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. దాంతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు, పెండింగ్ బిల్లులు చెల్లింపులకు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుందని చెబుతున్నాయి.

పంచాయతీలు, స్థానిక సంస్థలకు ప్రధానంగా కేంద్రం నుంచి విడుదలయ్యే నిధులే ఆధారం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్థిక సంఘం నిధులను కూడా పక్కదారి పట్టించింది. దాంతో పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లాపరిషత్తు ఆర్థికంగా చితికిపోయాయి. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది ఆఖరులో ఒక దఫా ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో కొంతమేరకు ఉపశమనం లభించింది. తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, బ్లీచింగ్ కొనుగోళ్లు, పారిశుద్ధ్యం వంటి అవసరాలకు వినియోగించారు. రెండో విడత నిధుల విడుదల కోసం గత కొన్ని రోజుల నుంచి పంచాయతీరాజ్‌వర్గాలు ఎదురు చూస్తున్నాయి.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కావాలంటే కొన్ని షరతులు ఉన్నాయి. ముఖ్యంగా పంచాయతీలు, స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిగి పాలకవర్గాలు పరిపాలిస్తుండాలి. ప్రధానంగా ఈ నిధులు బహిరంగ మల విసర్జన రహితంగా గ్రామాలను మార్చడం, చెత్త, వ్యర్థాలను ప్రాసెసింగ్ చేయడం, ఇంకుడు గుంతల ఏర్పాటు, వాటర్ రీసైక్లింగ్‌తో పాటు ఆరోగ్యం, విద్య, వ్యవసాయంలో సంస్కరణలు వంటి వాటికి ఖర్చు పెట్టుకొనే అవకాశం ఉన్నది. పంచాయతీలకు వసూలు జరిగే పన్నులు కేవలం నిర్వహణ, సిబ్బంది జీతాలకే సరిపోతుంటాయి. దీంతో ఏ పని చేయాలన్నా ఆర్థిక సంఘం నిధులపై ఆధారపడుతుంటాయి. 70 శాతం నిధులు పంచాయతీలకు, 20 శాతం నిధులు మండలపరిషత్తులు, 10 శాతం నిధులు జిల్లాపరిషత్తుకు విభజిస్తారు. వచ్చే వారంలోనే ఆయా సంస్థల ట్రెజరీలకు నిధులు జమ అవుతాయని అధికారవర్గాలు చెబుతున్నాయి. దీంతో పంచాయతీల్లో పెద్దఎత్తున మళ్లీ పనులు జరుగుతాయని ప్రజలు భావిస్తున్నారు.

పశువైద్యులు నిజంగా దేవుళ్లు

-పశువైద్య దినోత్సవంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): 'మొన్న గుంటూరులో ఒక కోడె దూడకు ప్రమాదం జరిగింది. పశువైద్యులు స్పందించిన తీరు చాలా బాగుంది. నోరులేని జీవాల ఆర్తనాదాన్ని అర్థం చేసుకుని వైద్యం చేసే పశువైద్యులు నిజంగా దేవుళ్లు. మా నాన్న కూడా ఒక పశువైద్యుడు అయినందుకు నేను ఎప్పుడూ గర్వపడుతూ ఉంటాను.'అని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. గుంటూరులోని కొత్తపేటలో ఉన్న జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో జరిగిన వరల్డ్ వెటర్నరీ డే కార్య క్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఒ.నరసింహారావు అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువుల ఆరోగ్యం ప్రజల ఆరోగ్యంతో అనుసంధానమై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పశువుల పట్ల ప్రేమ, బాధ్యత కలిగి ఉండాలని కోరారు. సమాజంలో పెంపుడు జంతువులతో పాటు వీధి కుక్కలు, పిల్లుల సంరక్షణకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. పశుసంవర్ధశాఖ జిల్లా అధికారి నరసింహారావు మాట్లాడుతూ ప్రపంచ పశు వైద్య దినోత్సం- 2025ను "పశు ఆరోగ్యం ఒక బృందం" అనే థీమ్ తో జరుపుకుంటున్నామని తెలిపారు. జంతువులకు అత్యున్నతస్థాయి సంరక్షణ, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి పశువైద్య బృందాలు, నిపుణులు కలిసి పనిచేయాలన్నదే ఈ థీమ్ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ప్రభుత్వ పశు వైద్యశాలలో నూతన భవనాల నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు ద్వారా రూ.14 లక్షలు కేటాయించినందుకు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని పశు వైద్యశాలలోని వైద్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ కె.వి.వి.సత్యనారాయణ , డాక్టర్. ఎం.రత్నజ్యోతి, ప్రముఖ సర్జన్ లక్కింశెట్టి నాగేశ్వరరావు, రాష్ట్ర వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ వై. ఈశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం. వెంకటేశ్వర్లు, ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్. కె. సాంబశివరావ , జిల్లా పశు వైద్య వైద్యులు పాల్గొన్నారు.



గుంటూరు పాలీ క్లినిక్‌లో చికిత్స పొందుతున్న కోడెకు మేత పెడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

అల్లరి మాయం.. సెల్ మయం

(5వ పేజీ తరువాయి)

మానసిక వైద్య నిపుణులు చెప్తున్నారు. పట్టణాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో ఉండే చిన్నారులు కూడా సెల్‌ఫోన్లకు బానిసలయ్యారు. పైగా తమ పిల్లవాడు అల్లరి చేయకుండా బుద్ధిగా ఉంటాడని వాడికి ఫోను ఉంటే చాలని తల్లిదండ్రులే గొప్పగా చెప్పుకుంటున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏడిస్తే.. అన్నం తినకపోతేనే చేతికి ఫోన్లు ఇవ్వడం మానేసి ఎత్తుకు తిప్పుతూ బయట ప్రపంచాన్ని పరిచయం చేయాలి. ఖాళీ సమయాల్లో వారిని ఇతర పిల్లల మధ్యలో గడిపేలా చేయాలి. అల్లరి అనేది పిల్లలకు ఏది తినాలో, వేటితో ఆడుకోవాలో, చేతుల్లోనివి ఇతరులకు పంచడం, చిన్న వ్యూహాలు వంటి విషయాలను నేర్పుతుంది. ఇలాంటి చర్యల వల్ల మెదడులో అన్ని నాడీకణాలు చురుగ్గా పనిచేస్తాయి. మట్టిలో ఆడుకున్నా ఏ ప్రమాదం ఉండదని మన బాల్యం మనకు నేర్పిన సంగతులు పిల్లలకు అర్థమయ్యేలా చేయాలి.


ఇలా గుర్తించాలి..

ఒత్తిడికి లోనైన పిల్లల ప్రవర్తన వయస్సుల వారీగా విభిన్నంగా ఉంటుంది. స్క్రీన్‌టైమ్‌కు బానిసలై ఒత్తిడికి లోనైన మూడేళ్ల నుంచి ఆరేళ్ల మధ్యవయస్సు గలిగిన పిల్లలు తమకు బాగా దగ్గరివారిని, ఇష్టమైన వస్తువులను అలాగే పట్టుకుని కూర్చుంటారు. ఈ ప్రవర్తన సాధారణం కంటే భిన్నంగా ఉంటుంది. ఆహారం తీసుకోవడం, నిద్రపోయే సమయాల్లో కూడా వేళలు పాటించరు. ఒక్కోసారి నిద్రలో లేని కాసేపు నవ్వడమో.. ఎడవడమో చేసి ఆ తర్వాత తిరిగి నిద్రకు ఉపక్రమిస్తారు. ఎక్కువ భయపడటం, మారం చేయడం, పెద్దవారితో వాదించడం, ఆటలు ఆడకపోవడం వంటి లక్షణాలు కనబడితే జాగ్రత్త పడితే మంచిది.

పెద్దల్లో నెలకొన్న భయాలు

చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులు, కిడ్నాప్‌లు వంటి భయాలతో చాలామంది తల్లిదండ్రులు పిల్లలను బయటకు తీసుకురావడానికి బయపడి ఇంటికే పరిమితం చేస్తున్నారు. బయటకు తీసుకెళ్లిన సమయంలో పిల్లల అల్లరి చూడటానికి కూర్చోగలం గాని వారిపై దాడి జరుగుతుందన్న భయంతో కూర్చోలేం గదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జరుగుతున్న ఘటనలు చూసి అసలు వారికి ఏ వయస్సు నుంచి రక్షణ కల్పించాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తమ పిల్లలు ఇతర పిల్లలతో కలసి ఆడుకోవాలని తమకు ఉంటుందని కానీ ఏ సమయంలో ఏం జరుగుతుందో అని అర్థం గాక ఇంట్లోనే ఉంచుకుంటున్నామని తల్లిదండ్రులు చెబుతున్నారు.


సమాజంతో మమేకం కావాలి



ఊహ తెలిసిన నాటి నుంచి పిల్లలకు సమాజంతో సంబంధాలు ఏర్పరచాలి. జ్ఞానాన్ని సంపాదించాలంటే సమాజంతో మమేకం తప్ప మరే మార్గం లేదు. టీవీలకు అతుక్కుపోతున్నారు అనుకునే లోపే జీవితాల్లోకి ఫోన్లు, ట్యాబ్‌లు వచ్చాయి. ఒక విధంగా చెప్పాలంటే ప్రస్తుత తరానికి ఇవి శాపంలా మారాయి. వీటి వల్ల అంత చిన్న పిల్లలకు పెద్దగా ఒరిగేది ఏమి లేకపోయినా శారీరక, మానసిక వ్యాధుల భారిన పడతారు. పెద్దలకు, సమాజానికి దూరంగా ఉంటారు. ఊబకాయం, తలనొప్పి, కంటి చూపు మందగించడం వంటి వాటి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

-డాక్టర్ బీ సతీష్‌కుమార్, సివిల్ సర్జన్, ఆర్‌ఎంవో జీజీహెచ్ గుంటూరు

పెద్దలే కారణం



పిల్లల్లో నెలకొన్న సమస్యలకు పెద్దవారే కారణం. మానసిక, ఉద్వేగాత్మక సంతోషం, సత్సంబంధాలు కొరవడిన కుటుంబం జైలు లాంటిది. వస్తు సంపద కోసం వెచ్చించడం మాని పిల్లలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలి. చిన్న వయస్సులో ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎట్టి పరిస్థితుల్లో స్మార్ట్‌ఫోన్‌కు దూరం చేయాలి.

-డాక్టర్ వీ వెంకటకిరణ్ మానసిక వైద్య నిపుణుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గుంటూరు వైద్య కళాశాల

పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి కృష్ణా పశ్చిమ డెల్టాకు 1316 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేసినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.5 అడుగుల నీటిమట్టం ఉంది. రేపల్లెకాల్వకు 176 , తూర్పుకాల్వకు 97, పశ్చిమకాల్వకు 103, నిజాంపట్నం కాల్వకు 125, కొమ్మమూరుకాల్వకు 706 క్యూసెక్కులనీరు విడుదల చేస్తున్నారు.

జాబ్ కార్డులు ఉన్న వారికి వంద రోజుల పని

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 17 గ్రామాల్లో జాబ్ కార్డు ఉన్న వారికి వంద రోజుల జాతీయ ఉపాధి హామీ పథకం పని కల్పించిందని, రోజుకు రూ.302గా నిర్ధారించినట్లు ఎంపీడీవో రమేష్ బాబు శనివారం తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద తైవాన్ జామ, నిమ్మ, గులాబీ, మల్లె తోటల సాగు చేసుకొనే అవకాశం ఈ పథకంలో ఉన్నదని, అలాగే సాగు భూమిలో సేద్యపు కుంటలు కూడా తవ్వించుకోవచ్చని, దీనికోసం గ్రామ సర్పంచ్, సెక్రటరీలు కార్డు దారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

నేడు సిడిమాను మహోత్సవం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వట్టిచెరుకూరులోని గ్రామస్థుల ఇలవేల్పుల అద్దంకమ్మ తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా శనివారం ప్రజలు భారీ ఊరేగింపుతో తరలి వచ్చి అమ్మవారికి పసుపు కుంకుమను సమర్పించారు. తిరునాళ్లలో ప్రధాన ఘట్టమైన సిడిమాను మహోత్సవం ఆదివారం సాయంత్రం నిర్వహించేందుకు ఆలయ కమిటీ, గ్రామపెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష మల్లెల పూజ

వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడు గ్రామంలోని పోలేరమ్మ, అద్దంకమ్మ తిరునాళ్ళ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం మల్లెలతో ప్రత్యేక పూజ నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ శనివారం వెల్లడించింది.

28 నుంచి బాలల సమ్మర్ క్యాంపు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): అమరావతి ఐకాన్ అసోసియేషన్ ఎంటీఎంసీ బాలోత్సవం ఆధ్వర్యంలో తాడేపల్లిలోని బైపాస్ రోడ్డులోని సీఎస్ఆర్ కల్యాణ మండపం సమీపంలో ఉన్న అమరావతి ఐకాన్‌లో ఈ నెల 28 నుంచి అపార్టుమెంట్‌లోని బాల బాలికలకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్, బాలోత్సవం ప్రతినిధులు ఎస్కే రియాజ్‌బాషా, గాదె సుబ్బారెడ్డి, న్యాయవాది పి.విక్రమ్, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి లక్ష్మీ వెంకటరత్నం, పట్టణ పౌర సంక్షేమ సంఘం నేత శేషయ్య, విశ్రాంత లెక్చరర్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

27న అమరావతి మెగా వైద్యశిబిరం

ఈ నెల 27న అమరావతి ఐకాన్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమరావతి ఐకాన్ క్లబ్ హౌస్ ఫంక్షన్ హాల్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఎస్కె రియాజ్‌బాష, రాజశేఖర్, లక్ష్మీ వెంకటరత్నం, కోటేశ్వరరావు తెలిపారు. విజయవాడ స్రవంతి హాస్పిటల్‌కు చెందిన వైద్యులు సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని అమరావతి ఐకాన్ అపార్టుమెంట్ వాసులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో గాదె సుబ్బారెడ్డి, సుబ్బారావు, విక్రమ్, శేషయ్య, స్వాములు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

దుగ్గిరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వివాహిత గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మండలకేంద్రం దుగ్గిరాలకు చెందిన రిమ్మనపూడి వెంకటసుబ్బలక్ష్మి(50), శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దికాలంగా తనభార్యకు మతిస్థిమితం లేదని, భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ ఎస్ వెంకటరవి తెలిపారు.



దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు, చింతలపూడి సమీపంలోని వృద్ధాశ్రమం మధ్య కొత్తగా 14కి.మీ. మేర నిర్మించిన రోడ్డుకు మార్జిన్ పనులు దాదాపు పూర్తికావచ్చాయి. తెనాలి-విజయవాడ మెయిన్‌రోడ్డు నిర్మాణం చేపట్టినప్పటికీ మార్జిన్ పనులలో జాప్యంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. మార్జిన్ ఏర్పాటు పట్ల వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

(దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)

హోటళ్లు, లాడ్జీల తనిఖీలు

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పట్టణ సీఐ కళ్యాణ్‌రాజు ఆధ్వర్యంలో ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు తాడేపల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న లాడ్జీలు, హోటళ్లలో శనివారం తనిఖీలు నిర్వహించారు. లాడ్జీలో ఉన్న రిసెప్షన్లలో మాట్లాడి ఎవరెవరు వస్తున్నారు. వెళుతున్నారు అన్న విషయాలను తెలుసుకున్నారు. పుస్తకాలు తనిఖీ చేశారు. లాడ్జి రూముల్లో ఉన్న వ్యక్తులతో మాట్లాడి ఎక్కడి నుంచి వస్తున్నారన్న వివరాలు తెలుసుకున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్టు సీఐ తెలిపారు. సీఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం పనులు చేయాలి : ఎంపీడీవో

పెదనందిపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం పనులు నిబంధనల మేరకు పనులు చేయాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. మండలపరిధిలోని పాలపర్రు, కట్రపాడు, గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను శనివారం ఆమె పరిశీలించారు. కూలీల హాజరును పరిశీలించారు. జాబ్‌కార్డు కలిగిన వారు మాత్రమే పనులకు హాజరుకావాలని తెలిపారు.

డ్రెయినేజ్‌ను తలపిస్తున్న అప్పాపురం చానల్

● గుర్రపు డెక్క, వ్యర్థాల నీటితో దుర్వాసన భరితం

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రెండు మండలాల పరిధి గ్రామాల ప్రజలకు తాగు నీరు, వేలాది ఎకరాలకు సాగు నీరు అందించే అప్పాపురం చానల్ గుర్రపుడెక్కతో నిండిపోయింది. కలుషిత నీటి ప్రవాహంతో డ్రెయినేజ్‌ని తలపిస్తుంది. గత ఖరీఫ్ సాగుకు అప్పాపురం ఛానల్‌లో గుర్రపు డెక్క పేరుకు పోయి నీరు అందించలేని దుస్థితి నెలకొంది. రబీ సాగు నెల రోజుల క్రితం ముగిసినా నేటికి నీటి ప్రవాహం కొనసాగుతూ కాలువలో గుర్రపు డెక్క పెరగటానికి అనువుగా ఉంటోంది. ఖరీఫ్ సాగుకు సిద్ధమై వరి నారుమళ్లు పోసేందుకు రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి గతంలో నెలకొంది. కూటమి ప్రభుత్వం రైతుల దుస్థితిని గమనించి సాగునీటిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి గుర్రపు డెక్కను తొలగించి సాగునీరు అందించారు. ప్రస్తుతం కాలువ దుస్థితి అదేస్థితిలో ఉన్న నేపథ్యంలో రైతుల్లో ఆందోళన మొదలైంది. కూటమి ప్రభుత్వం అప్పాపురం ఛానల్‌కు నీటిని నిలిపి వేసి యుద్ధ ప్రాతిపదికపై గుర్రపు డెక్కను తొలగించి సకాలంలో ఖరీఫ్‌కు సాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని వట్టిచెరుకూరు, కాకుమాను మండలాల రైతులు అభ్యర్థిస్తున్నారు.



చేబ్రోలు - వట్టిచెరుకూరు మండలాల పరిధిలో గుర్రపుడెక్కతో నిండిన అప్పాపురం ఛానల్



వ్యర్థాలతో నిండిన ఛానల్

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



రైతులకు తైవాన్ స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్

తాడికొండ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం తాడికొండ మార్కెట్‌యార్డులో వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మండల పరిధిలోని రైతులకు పనిముట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనులకు ఉపయోగపడే విధంగా కూటమి ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తుందని తెలిపారు. మండలపరిధిలో 81 వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు అందించినట్లు తెలిపారు. రూ.44.34 లక్షలు విలువ కలిగిన తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ పనిముట్లైన గొర్రులు, రోటో వేటర్లు, నాగళ్లు, విత్తనాలు వెద పెట్టే గొర్రులు, పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్లు రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రైతులకు రూ.17.50 లక్షల సబ్సిడీ ద్వారా లబ్ధిపొందుతారన్నారు. అంతేకాకుండా 3 డ్రోన్లు కేటాయించినట్లు ఒక్కొక్క డ్రోన్‌కు రూ.8 లక్షల సబ్సిడీ లభిస్తుందన్నారు. వేసవిలో అపరాల సాగుకు 50 శాతం సబ్సిడిపై విత్తనాలు ఇస్తున్నారన్నారు. పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు కూడా 50 శాతం సబ్సిడీపై ఇస్తున్నారని తెలియజేశారు. పీఎం డీఎస్ కిట్లను అందజేశారు. రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించి ప్రకృతి వ్యవసాయాన్ని కూడా సాగు చేయటానికి అవసరమైన వనరులను సమకూరుస్తామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ విజయశేఖర్, మండల అధ్యక్షుడు తలశిల ప్రసన్నకుమార్, టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య, మాజీ మార్కెట్‌యార్డు ఛైర్మన్లు గుంటుపల్లి మధుసూదనరావు, చిమటి వెంకటేశ్వర్లు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ రాజకుమారి, ఎంపీడీవో కే సమతావాణి, వ్యవసాయశాఖ అధికారి నరసింహారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు యడ్లపల్లి సాంబశివరావు, నీలాల కృష్ణారావు, గడ్డిపాటి సాంబశివరావు, చిగురుపాటి అనూప్, దగ్గుమల్లి శ్రీనివాసరావు, బండ్ల కోటేశ్వరరావు, తదితర నాయకులు, రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అశోకా పాఠశాలలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్

పెదనందిపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక అశోకా పాఠశాలలో శ్రీఅంజలి హాస్పిటల్ గుంటూరు వారు శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ గోవింద్, వైద్య బృందం 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తొలుత రోటరీ డైరెక్టర్ పోపూరి లక్ష్మీనారాయణ వైద్యశిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వైద్యశిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. రోగులు వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు.

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును కలిసిన టీడీపీ నేతలు

పెదనందిపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని నాగులపాడులో మే 14న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు రావాలని కోరుతూ నరసరావుపేట ఎంపీ, టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలుకు టీడీపీ నాయకులు శనివారం గుంటూరులోని ఎంపీ కార్యాలయంలో ఆహ్వాన పత్రికను అందజేసి సత్కరించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి నాయకులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో తాగునీటి చెరువుకు మరమ్మతులకు ఎంపీ నిధుల నుంచి కేటాయిస్తానని బాగుచేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండి నాగబాబు, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, నాయకులు పాటిబండ్ల మురళి, పాటిబండ్ల నాగేశ్వరరావు, పాటిబండ్ల నాగబాబు, కలవకూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న నాగులపాడు టీడీపీ నేతలు

అనాథ బాలికలకు 'చిన్మయ విజయ' బాసట

● చేరదీసి చదివిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు
● ఉన్నత స్థానాల్లో స్థిరపడుతున్న బాలికలు
● ఈ ఏడాది 30 మందికి ప్రవేశ అవకాశం!



చిన్మయ విజయలో ఇటీవల జరిగిన అలుమ్ని వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

మంగళగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం కాజ గ్రామంలోని చిన్మయ విజయ ఆశ్రమం అనాథ బాలికలకు బాసటగా నిలుస్తుంది. బాలికలను చేరదీసి ఉన్నత చదువులు చదివిస్తూ వారి పెళ్లి కూడా పూర్తయ్యే వరకు దత్తతగా స్వీకరించి బాధ్యతగా చూసుకుంటుంది. పూజ్య గురుదేవ్ స్వామి చిన్మయానందకు సమర్పణగా 2007లో చిన్మయ విజయ ఆశ్రమం స్థాపించబడింది. డాక్టర్ సుమతి ముక్కామల, డాక్టర్ అప్పారావు ముక్కామల ఆధ్వర్యంలో చిన్మయ విజయ ఆశ్రమం ఏర్పాటైంది. ఈ ఆశ్రమంలో ఇప్పటివరకు 40 మందికి పైగా బాలికలు డెంటిస్టులు, కంప్యూటర్ ఇంజనీర్లు, కెమికల్ ఇంజనీర్లు, ఎకౌంటెంట్లు, బిజినెస్ అడ్మినిస్ట్రేటర్లు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, అనస్తీషియా టెక్నీషియన్లు వంటి వృత్తుల్లో పట్టాలు సాధించి జీవితాలను నిర్మించుకున్నారు. మరి కొంత మంది వివాహాలు చేసుకుని స్థిరపడ్డారు. ప్రస్తుతం చిన్మయ విజయలో సుమారు వంద మంది పిల్లలు వుంటూ ఇంగ్లీషు మీడియం పాఠశాలల్లో చదువుతున్నారు. మార్కులు, ప్రవేశ పరీక్షల ర్యాంకుల ఆధారంగా తమకు ఇష్టమైన కళాశాలల్లో చేరుతున్నారు. ఒక్కసారి చిన్మయ విజయలో చేరిన తర్వాత పిల్లల చదువు పూర్తయ్యే వరకు, ఉద్యోగం పొందే వరకు, పెళ్లి జరిగే వరకు సంస్థ దత్తతగా చూసుకుంటుంది. చిన్మయ విజయ ఆశ్రమానికి డాక్టర్ నరసరాజు మంతెన, శారదా యార్లగడ్డ, రమణకుమార్ ఐపీఎస్, డాక్టర్ శ్రీధర్ కోనేరు, చుక్కపల్లి కోటేశ్వరరావు, స్వామి సువీరానంద సలహా మండలి సభ్యులుగా వున్నారు. చిన్మయ విజయ ఆశ్రమంలో ఈ ఏడాది 5 నుంచి 9 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న సుమారు 30 మంది అనాథ, ఉపేక్షిత బాలికలను తీసుకోవాలని యోచిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆశ్రమంలో చేరే వారికి మొదటి ప్రాధాన్యతగా అనాథలకు, ఆ తర్వాత ఒంటరిగా తల్లిదండ్రులతో వున్న పిల్లలకు అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇతర వివరాల కోసం నీలిమ, సెల్: 9704818777, రామకృష్ణ, సెల్: 9000374132 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జనసేన ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి కూడలి పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్ వద్ద జనసేన మండల, పట్టణ నేతల ఆధ్వర్యంలో శనివారం ఉండవల్లి సెంటర్ నుంచి కేఎల్ రావు కాలనీ వరకు క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. కశ్మీరులోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో మరణించిన కుటుంబాలకు సంతాపంగా ఉండవల్లి సెంటర్లో మానవహారం కూడా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన రూరల్ అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అంబటి తిరుపతిరావు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ పిలుపు మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు ఆదేశానుసారం ఈ ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేతలు వీరమహిళలు పాల్గొన్నారు.

దుగ్గిరాల, (ఆంధ్రజ్యోతి): జమ్ము-కశ్మీర్‌లోని పహల్గాం వద్ద బైసరన్‌లోయలో పర్యాటకులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన శనివారం సాయంత్రం నిర్వహించారు. స్థానిక నేతాజీ సుభాష్‌చంద్రబోస్ విగ్రహం ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో ఉగ్రదాడిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.

పెదనందిపాడు(ఆంధ్రజ్యోతి): పహల్గామ్ ఉగ్రదాడి ముష్కరులను కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు రమేష్‌బాబు అన్నారు. తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు.



ఉండవల్లి సెంటర్‌లో జనసేన ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్లాట్ బుకింగ్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్స్ చేయించుకునే వారికి స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పించినట్లు ప్రత్తిపాడు సబ్‌రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ సౌకర్యం కల్పించిందన్నారు. రిజిస్ట్రేషన్స్ కోసం వచ్చే వారు గంటల తరబడి కార్యాలయం వద్ద వేచి ఉండకుండా నిర్ణీత సమయంలో వారి రిజిస్ట్రేషన్ పూర్తయ్యే విధంగా ఈ స్లాట్ బుకింగ్ సౌకర్యం కల్పించారన్నారు. ముందుగా స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు తమకు కేటాయించిన సమయానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రావచ్చునని శ్రీనివాసరావు తెలిపారు.

కాజలో సంజీవని ఆరోగ్య రథం సేవలు



వైద్యశిబిరంలో పాల్గొన్న ఆరోగ్య రథం సిబ్బంది, గ్రామస్థులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంజీవని ఆరోగ్య రథం ద్వారా మంగళగిరి మండలం కాజ గ్రామంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని యాదవ బజారు లైబ్రరీ సెంటరులో ఏర్పాటు చేసిన శిబిరం ద్వారా ఉదయం నుంచి సాయంత్రం వరకు 91 మంది రోగులకు వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో కాజ టీడీపీ అధ్యక్షుడు పల్లబోతుల శ్రీనివాసరావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గాదె పిచ్చి రెడ్డి, నేతలు ఆర్ల నాగేశ్వరరావు, దొడ్డక వాసు, బీవీఎల్ నారాయణ, గోగుల సురేష్, ఆరోగ్య రథం వైద్యులు కే నవీన్‌కుమార్, సిబ్బంది సుచరిత, ఉమాదేవి, అభిరామ్ పాల్గొన్నారు.

నేడు ఉప్పలపాడులో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

పెదనందిపాడు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఉప్పలపాడులో నవోదయ ఎడ్యుకేషనల్ అండ్ హెల్త్‌కేర్ సొసైటీ సభ్యులు, గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఆదివారం సాయంత్రం 6గంటలకు జరుగుతుందని నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీ షెడ్యూల్డ్ కూలాల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దుంగా రత్నప్రదీప్, జైభీమ్లా ఎంప్లాయిస్ వేల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికల రవికుమార్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్, డీబీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్‌లతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.

ఎన్‌హెచ్ఆర్‌సీబీ సంయుక్త కార్యదర్శిగా సాయిచంద్



సాయిచంద్

మంగళగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ అండ్ యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా ఏపీ సంయుక్త కార్యదర్శిగా మంగళగిరికి చెందిన చదలవాడ సాయిచంద్ నియమితులయ్యారు. ఈ మేరకు సాయిచంద్ నియామకాన్ని ధ్రువీకరిస్తూ సంస్థ చైర్మన్ డాక్టర్ కేఎస్ జ్యోతీశ్వర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సాయిచంద్ న్యాయ విద్యను పూర్తి చేసి జర్నలిజంలో కొనసాగుతున్నారు. ఆయన నియామకంపై పలువురు ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు కృషి చేయాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీరాంజనేయులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జీ వీరాంజనేయులు కోరారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను గురించి తెలియజేస్తూ శనివారం మంగళగిరి పట్టణంతోపాటు నవులూరు గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్మల కళాశాలలో అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నాలుగో శనివారం మాదక ద్రవ్యాల వినియోగం, వాటి వలన కలిగే అనర్థాలను గురించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐలు ఎ.పద్మజ, జే.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మలినేనిలో ఎస్ఎస్ - 2025 అంతర్జాతీయ సదస్సు



మలినేనిలో ఎస్ఎస్-2025 అంతర్జాతీయ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డైరెక్టర్ శ్రీనివాసకుమార్

వట్టిచెరుకూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుల్లడిగుంట సమీపంలోని మలినేని లక్ష్మయ్య ఇంజనీరింగ్ కళాశాలలో అడ్వాన్స్ కమ్యూనికేషన్ కంప్యూటరింగ్, ఎలక్ట్రానిక్ సిస్టమ్ 2025 అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను శనివారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ డీ శ్రీనివాసకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మలినేని కళాశాలలో ఈసీఎస్ఐ విశ్వవిద్యాలయం మలేషియా టెక్నికల్ స్పాన్సర్ చేసిన ఈ కాన్ఫరెన్స్‌కు రెండు వందలకు పైగా పరిశోధనా పత్రాలు మార్చి 10వ తేదీన కాన్ఫరెన్స్‌కు అందజేసినట్టు వివరించారు. వీటిలో 47 పరిశోధనా పత్రాలు అర్హత పొందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి కీ నోట్ స్పీకర్లుగా ప్రొఫెసర్ డాక్టర్ రేణు, ఏఎల్ కొలందై స్వామి, డైరెక్టర్ ఇనిస్టూట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్నోవేషన్, యూసీఎస్ఐ యూనివర్శిటీ మలేరియా పాల్గొన్నారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ప్రధాన ఉపయోగాలు, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, ఐవోటీ ప్రాము ఖ్యంపై అవగాహన కల్పించగా వీఐటీ ప్రొఫెసర్ జయేంద్రకుమార్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు, వాటిలో వీఎల్ఎస్ఐ పాత్ర గురించి విద్యార్థులు ఇతర నిపుణులతో చర్చించారు. కార్యక్రమంలో మలినేని చైర్మన్ పెరుమాళ్ళు, కళాశాల ప్రిన్సిపాల్ జే అప్పారావు, ప్రోగ్రాం చైర్మన్ అనీల్‌కుమార్, డీన్స్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

శరవేగంగా అమ్మవారి ఆలయరోడ్డు నిర్మాణం పనులు



కేఆర్‌కొండూరు-చిలుపూరు మధ్య జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనులు

దుగ్గిరాల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధి చెందిన కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి ఆలయం మీదుగా రోడ్డు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మరో వారం రోజుల్లో అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమం జరుగనున్న నేపథ్యంలో మంత్రి నారా లోకేశ్ చొరవతో రోడ్డు నిర్మాణం పనులు ఊపందుకున్నాయి. అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మేనెల 4వ తేదీన అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ఠ జరుగనున్న విషయం విదితమే. రూ.కోటి 80లక్షలతో జరుగుతున్న రోడ్డు నిర్మాణం పనులు పూర్తిచేయడంపై వివిధ ప్రాంతాల నుంచి అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జేకేసీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థులు

తాడేపల్లి (ఉండవల్లి), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లి పరిధిలోని కరకట్ట వద్ద ఉన్న ఓ రిసార్ట్‌లో గుంటూరు జేకేసీ కళాశాల 1989-94 బ్యాచ్ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జేకేసీ కళాశాల విశ్రాంత ఇంగ్లిషు లెక్చరర్ నర్రా నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ ఇటువంటి సమ్మేళనాలు వారి జీవిత కాలాన్ని పెంచుతాయని, ఉల్లాసాన్ని కలిగిస్తాయని చదువుకున్న రోజుల్లోని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకునేందుకు ఇదో వేదిక అని చెప్పారు. మరో విశ్రాంత లెక్చరర్ సాంబశివరావు మాట్లాడుతూ అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మారుతున్న కాలానికి అనుగుణంగా యోగా, ధ్యానం చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి హాజరైన అలనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఏలూరు సీటీవో కోటేశ్వరరావు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ గడ్డిపాటి అనిల్‌కుమార్, పతంజలి రాష్ట్ర స్వాభిమాన్ ట్రస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్, సీనియర్ జర్నలిస్టు కాలారి నరసింహారావు, సురేష్, అమెరికన్ బ్లూక్రాఫ్ట్ ఈడీ రఘు, భీమినేని వెంకటేశ్వరరావు, పీఎఫ్ వెంకటేశ్వర రావు, నాగుల్ మీరా, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, అరుణ, స్వాతి, మువ్వా శ్రీను, ప్రసాద్, హైమా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జాతీయ నాయకులపై అవగాహన కల్పించాలి



సుబ్బరాయశాస్త్రిని సత్కరిస్తున్న కేఎల్‌యూ ప్రో ఛాన్సలర్ జగన్నాథరావు

తాడేపల్లి (వడ్డేశ్వరం), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యార్థి దశ నుంచే జాతీయ నాయకుల గురించి స్వాతంత్ర్య సమరయోధుల గురించి అవగాహన పెంచుకోవాలని విజ్ఞాన భారతి రాష్ట్ర ఇన్‌చార్జి సుబ్బరాయశాస్త్రి అన్నారు. శనివారం కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో సైన్స్ కళాశాల ఎన్‌సీసీ 10 ఆంధ్రా బెటాలియన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వాతంత్ర్య పోరాటంలో శాస్త్రవేత్తల పాత్ర అనే అంశంపై ఏర్పాట్లు చేసిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్బరాయ శాస్త్రి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో శాస్త్రవేత్తలు కీలకపాత్ర పోషించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోచాన్సలర్ కేఎస్ జగన్నాథరావు, వీసీ సారధివర్మ, ప్రోవీసీలు ప్రసాద్, రాజశేఖరరావు, వెంకటరామ్, రిజిస్ట్రార్ సుబ్బా రావు, డీన్లు కేఆర్ఎస్ ప్రసాద్, హబీబుల్లాఖాన్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబాలెం పారిశ్రామికవాడ అభివృద్ధికి సహకారం

మంగళగిరి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలో ఉన్న ఎర్రబాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఏపీ వైస్‌చైర్మన్ నరేంద్రకుమార్ చెప్పారు. సీఐఐ ప్రతినిధుల బృందం శనివారం ఎర్రబాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు విచ్చేసి ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమయ్యారు. నరేంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను అభివృద్ధి చేయాలని చూస్తుందన్నారు. దానికోసం ఎంఎస్ఎంఈ కార్పొరేషన్‌ను కూడా ఏర్పాటు చేసిందన్నారు. సీఐఐ విజయవాడ జోన్ వైస్‌చైర్మన్ నాగలక్ష్మీ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో పరిశ్రమల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ సమావేశంలో ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సరికొండ రామరాజు, కార్యదర్శి సీతారామశర్మ, అశోక్, అజయ్‌బాబు, రావెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు సద్వినియోగించుకోవాలి

పెదనందిపాడు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన కేంద్రం వారు ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు, యువత సద్వినియోగించుకోవాలని పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ జీ వీరరాఘవయ్య అన్నారు. స్థానిక తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులు ఈ శిక్షణా తరగతుల వల్ల విద్యతో పాటు జనరల్ నాలెడ్జ్ కూడా పెంపొందించుకోవచ్చునని తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులు

త్వరితగతిన కమిటీల నియామకాల పూర్తి

● ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలిరూరల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): తెనాలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నూతన కమిటీల నియామకాలను ప్రారంభించి, త్వరితగతిన పూర్తి చేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ ఇచ్‌చార్జ్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్య నేతలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజవర్గ వ్యాప్తంగా సాధికార సారథులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, గ్రామ, వార్డు కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. పట్టణ, మండల అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, వంగాసాంబిరెడ్డి, మహమ్మద్ ఖుద్దుస్, నన్నపనేని సుధాకర్, డాక్టర్ వేమూరి శేషగిరిరావు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ తదితరులు

పంచాయతీలు స్వయం సమృద్ధి సాధించాలి

పొన్నూరుటౌన్. ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు పారదర్శక పాలనతో స్వయంసమృద్ధి సాధించాలని సంగం డెయిరి మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ అన్నారు. శనివారం వడ్లమూడి సంగం డెయిరిలో పంచాయతీ గవర్నెన్స్ సెమినార్.. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెని సెక్రటరీస్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ గుంటూరు ఆధ్వర్యంలో నిర్వహించారు. మోడల్ పంచాయతీ కోడ్‌ను ఐసీఎస్ఐ ఆధ్వర్యంలో పంచాయతీ పాలకులకు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన అమరావతి చాప్టర్ ఛైర్మన్ ఎంవీఎస్ నాగరాజు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పారదర్శకత ఉండాలన్నారు. భాధ్యతాయుత పాలన సమర్థవంతమైన నాయకత్వం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐసీఎస్ఐ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా పంచాయతీ గవర్నన్స్ వారోత్సవాలలో భాగంగా సెమినార్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సెమినార్‌లో సంగం డెయిరి కంపెనీ సెక్రటరీ సీఎస్ సందీప్, శ్రీనివాసరావు, ఐసీఎస్ఐ సభ్యులు పలు పంచాయతీల సర్పంచ్‌లు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



సమస్యలు వింటున్న రాజశేఖర్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికుల సమస్యలపై శనివారం ఆర్టీసీ నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలు ప్రాంతాల నుండి ప్రయాణికులు సమస్యలను డిపో మేనేజర్ రాజశేఖర్ దృష్టికి తెచ్చారు. సమస్యలను పరిష్కరిస్తామని డీఎం సమాధానం ఇచ్చారు. సచివాలయం నుండి సాయంత్రం 6.30 గంటలకు తెనాలికి బస్సు ఏర్పాటు, బస్ స్టేషన్‌లో కొల్లిపర బస్సులు ఆగే ప్రాంతంలో శుభ్రత లేకపోవడం, సచివాలయ బస్సులలో మంచి సీట్లు, డోర్లు లేకపోవడం, నడిరోడ్డుపైనే బస్సులు ఆపడం, పెదగాదెలవర్రు గ్రామానికి మరో బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని, బాపట్లకు నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలని, కర్లపాలెం, కొల్లిపర కరకట్ట మీదుగా విజయవాడకు బస్సులు వేయాలని, భట్టిప్రోలు ట్రిప్పులు పెంచాలని, పేరేచర్ల, నాగార్జునసాగర్, గుంటూరు కలెక్టరేట్ వరకు బస్సులు వేయాలని పలువురు ప్రయాణికులు డీఎంను కోరారు.



తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయుడు వెంకయ్య

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడి బాట

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య బడి బాట ప్రతిజ్ఞ కార్యక్రమం చేపట్టారు. సంగం జాగర్లమూడిలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిచేత ప్రభుత్వ బడి బాట ప్రతిజ్ఞ చేయించారు. రత్నకుమారి, సురేఖ, నాగేంద్రమ్మ, మార్గరేట్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డులకు క్రైస్తవ విద్యార్థులకు ఆహ్వానం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యలో ప్రతిభ చూపిన క్రైస్తవ విద్యార్థులకు విలియం కేరీ ఎడ్యూకేషనల్ అచీవ్‌మెంట్ అవార్డులు, నగదు బహుమతులు అందిచనున్నట్లు జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ ఛైర్మన్ జోసెఫ్ మోసిగంటి శనివారం తెలిపారు. ఈ అవార్డులకు ఏప్రిల్ 30 తేదీలోగా వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఇతర వివరాల కోసం 70754 82182 నెంబర్‌ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరించుకోవాలి

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు గృహ వినియోగదారులు జూన్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఎం.వెంకట నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కిలోవాట్ విద్యుత్‌కు రూ.2,200 చెల్లించాల్సి ఉండగా క్రమబద్ధీకరించుకునే వారికి కిలో వాట్‌కు రూ.1000, సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ రాయితీ క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా విద్యుత్ వినియోగదారులకు ఏఈ సూచించారు.

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చెంచుపేటలో శనివారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. సుప్రియ స్మారక ఆయుర్వేద వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ ఆళ్ల నాగిరెడ్డి శిబిరంలో రోగులను పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 100 మందికి పైగా కీళ్లు, నరాలు, కండరాలు, చర్మ వ్యాధుల రోగులకు సేవలు అందించారు. రూ.80 వేలు విలువ చేసే మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్యులు నాగేంద్రబాబు, సుధాకర రెడ్డి, శిరీష పాల్గొన్నారు.

జాన్‌పాల్‌కు డాక్టరేట్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మారీసుపేటలోని రాక్ గాస్పెల్ చర్చి సంఘ కాపరి బిషప్ పినపాటి జాన్‌పాల్ డాక్టరేట్ అందుకున్నారు. బెంగళూరులోని న్యూ విస్‌డమ్ బైబిల్ కళాశాలలో శనివారం జరిగిన స్నాతకోత్సవంలో కళాశాల యాజమాన్యం డాక్టరేట్ ప్రదానం చేసిందని ఆయన తెలిపారు.

పేదలకు ఆపన్నహస్తంలా సీఎం రిలీఫ్‌ఫండ్

● మంత్రి మనోహర్



లబ్ధిదారులకు నగదు చెక్కులు అందజేస్తున్న మంత్రి మనోహర్

తెనాలిరూరల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): అనారోగ్య సమస్యలతో ఖరీదైన వైద్య సేవలు సైతం పేదలు పొందేందుకు అప్పన్నహస్తంలా సీఎం రిలీఫ్‌ఫండ్ నిలుస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో 23 మంది లబ్ధిదారులకు రూ.16,52,043 చెక్కులను ఆయన పం పిణీ చేశారు. పేదల కు ప్రభుత్వం అన్ని వేళలా అండగా నిలుస్తుందని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరితగతిన సమస్యల పరిష్కారానికి కృషి

తెనాలిరూరల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): తన కార్యాలయంలో సమస్యలతో వచ్చి అర్జీలు అందించిన ప్రతి ఒక్కరి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తానని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలువురు సమస్యలపై అర్జీలను మంత్రికి అందజేశారు. అనంతరం చిరువ్యాపారికి తోపుడు బండి, వృద్ధురాలికి ట్రైసైకిల్‌ను అందించారు.

● తెనాలి అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో 596 మార్కులు సాధించి టౌన్ టాపర్‌గా నిలిచిన విద్యార్థిని కమాదుల రుక్మిణిని మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు.

కరణం ధర్మారావు మృతి బాధాకరం



కరణం ధర్మారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలిరూరల్, ఏప్రిల్26(ఆంధ్రజ్యోతి): పేదలకు అనేక సేవా కార్యక్రమాలు అందించి పేరు ప్రఖ్యాతులు పొందిన హెచ్‌సీవీ అధినేత కరణం వెంకటేశ్వరరావు తండ్రి ధర్మారావు మృతి బాధాకరమని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని కఠెవరంలో దివంగత ధర్మారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కూడా నివాళులర్పించారు. కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, నాయకులు ఉన్నారు.



అవగాహన కార్యక్రమంలో కౌన్సిలర్ అరుణ, సూపర్‌వైజర్

'కిశోరి వికాసం' బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది

● టీడీపీ కౌన్సిలర్ అరుణ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం పథకం బాలికల బంగారు భవిష్యత్‌కు పునాది అని టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ అన్నారు. శనివారం స్థానిక 27వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాశం అవగాహన కార్యక్రమాన్ని అంగన్‌వాడీ సూపర్వైజర్ వై.నాగమణి నిర్వహించారు. ముఖ్య అతిథిగా అరుణ పాల్గొన్నారు. వార్డు అడ్మిన్ సెక్రటరీ పి.భాస్కరరావు, ఏఎన్ఎం పి.సునీత, ఎంఎస్‌కే జి.ప్రత్యూష, చంద్రకళాధరి, పాద్మావతి పాల్గొన్నారు.

కిశోరి బాలికలు క్రమశిక్షణతో మెలగాలి



సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధిక

కొల్లిపర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికలు క్రమ శిక్షణతో మెలగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. శనివారం చివలూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు కిశోరి బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికల పట్ల స్నేహపూర్వకంగా ఉండాని సూచించారు. ఆడ పిల్లలను మగ పిల్లలతో సమానంగా చదివించాలన్నారు. ఎంఎస్‌కే క్రాంతి, ఐసీడీఎస్ సిబ్బంది ఆదిలక్ష్మి, జ్యోత్స్న, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టంపై అవగాహన ఉండాలి

● ఎంఈవో సాల్మన్‌రాజు

కొల్లిపర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ సాల్మన్‌రాజు అన్నారు. శనివారం స్థానిక విద్యాభవనంలో విద్యాహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టంతో పేదవిద్యార్థులకు ఉన్న ఉపయోగాలను వివరించారు. ఎంఈఓ ఝాన్సీ, సీఆర్పీలు పిడపర్తి రమేష్‌బాబు, మురళి, స్వరూపరాణి, రాంబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో సాల్మన్‌రాజు

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నెహ్రూరోడ్డులోని గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుందని గ్రంథాలయ నిర్వాహకురాలు లావణ్య సుధ తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, జికె, కథలు చెప్పడం, గ్రంథ పఠనం, పేపర్ వంటి అంశాలలో శిక్షణ ఉంటుందని, విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

1 నుంచి శిక్షణ తరగతులు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కన్నెగంటి రెడ్డెమ్మ చౌదరి, అన్నపూర్ణాదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఎదురు ఉన్న ఫౌండేషన్ ఆవరణలో మే 1 నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఉదయం 5.30 నుంచి 11.30 గంటల వరకు యోగ, కూచిపూడి నాట్యం, కర్ణాటక సంగీతం, డ్రాయింగ్, సంస్కృతం, తెలుగులో శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు 99499 28425 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

రేపటి నుంచి కరిముల్లా బాబా ఉరుసు మహోత్సవం

పెదకాకాని, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పెదకాకానిలో ఉన్న కరిముల్లా బాబావారి 16వ ఉరుసు మహోత్సవం ఆదివారం నుండి వైభవంగా ప్రారంభం కానుంది. కరిముల్లా బాబా, గుర్రం ఒంట్లోకి ప్రవేశించి పెదకాకాని పురవీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. దర్గా వ్యవస్థాపకుడు పటాన్ మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో ఈ ఉరుసు మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిపించనున్నారు. శనివారం రాత్రి కంబల్ ఫతేహా జరిపించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో అన్నదాత సుఖీభవ సంఘ సభ్యులు నిర్వహిస్తున్న వేసవి చలివేంద్రంలో శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. సంఘ సభ్యులు జాస్తి కోటయ్య, సంపూర్ణమ్మ దంపతుల జ్ఞాపకార్థం కుమారుడు జాస్తి శ్రీనివాసరావు సహకారం అందించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌లోని షిర్డిసాయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు శనివారం ఎస్వీ యోగా సేవా కేంద్రం సభ్యులు భానుప్రసాద్ వర్థంతి సందర్భంగా కుమారుడు ముఖేష్ సహకారంతో అన్నదానం, పండ్లు పంపిణీ చేశారు. సేవా కేంద్రం కన్వీనర్ ఎం.రమణయ్య, సరోజ, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పథకాన్ని వినియోగించుకోవాలి

కొల్లిపర, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగించుకోవాలని ఏపీఓ వెంకయ్య కోరారు. శనివారం వల్లభాపురం, మున్నంగి, దంతలూరు, అత్తోట తదితర గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్‌లు బుజ్జిబాబు, సాగర్, వి. రాజేంద్ర, కోటేశ్వరరావు, సునీల్ ఉన్నారు.

కాల్వల్లో పేరుకుపోతున్న గుర్రపు డెక్క

తెనాలి అర్బన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సాగు నీరు పారాల్సిన కాల్వల్లో గుర్రపు డెక్క పేరుకుపోతోంది. గత ప్రభుత్వంలో సాగునీటి కాల్వలను నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా ఎక్కడ చూసిన గుర్రపు డెక్క, తూటికాడ, పిచ్చి ఆకుతో కాల్వలు నిండిపోయాయి. కృష్ణా పశ్చిమ డెల్టా తూర్పు, నిజాంపట్నం, పడమర కాల్వలతో పాటు వీటి నుంచి అనుసంధానమయ్యే పలు కాల్వలన్నింటిలోనూ ఇదే సమస్యగా ఉంది. దట్టంగా అల్లుకుపోవడంతో సాగు నీరు దిగువకు పోయేందుకు ఆటంకంగా మారిందని రైతులు చెబుతున్నారు. సకాలంలో నీరు అందకపోతే దిగుబడిపై ప్రభావం చూపుతుందని అంటున్నారు. భారీ వర్షాలు పడిన సమయంలో వర్షపు నీటిని బయటకు పంపే డ్రెయిన్లు కూడా గుర్రపు డెక్క, తూటికాడతో నిండిపోయాయి. రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి వీటిని తొలగించకపోతే పొలాలు ముంపు సమస్యను ఎదుర్కొని పంట నష్టానికి కారణమవుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే కాల్వలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



పడమర కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

నూతన భవన నిర్మాణ అనుమతులు సులభతరం

మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలి, మారీసుపేట, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో నూతనంగా భవన నిర్మాణాలు చేపట్టే భూ యజమానులకు అనుమతులను సులభతరం చేసినట్లు మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న శనివారం తెలిపారు. స్వీయ ధృవీకరణ పథకం - 2025లో భాగంగా ప్రజలు స్వీయ ధృవీకరణ అంగీకార పత్రం సమర్పించి సులభతరంగా అనుమతులు పొందవచ్చన్నారు. లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, సర్వేయర్, ఇంజినీర్ల ద్వారా గ్రామకంఠం, అప్రూవల్ అయిన లేఅవుట్లు, సర్క్యులేషన్ ప్యాట్రన్స్ అప్రూవల్ అయిన ప్రాంతాల్లో గృహ నిర్మాణానికి పారదర్శకంగా అనుమతులు పొందవచ్చన్నారు. ఆసక్తిగల అర్హులైన ఐటీఐ సివిల్, డిప్లమో సివిల్, బీటెక్ సివిల్ అభ్యర్థులు పురపాలక సంఘ కార్యాలయం లేదా ఏపీవోబీపీఎస్, ఏపీడీపీఎంఎస్ పోర్టల్ ద్వారా లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్, ఇంజనీర్ల లైసెన్స్ కొరకు దరఖాస్తు చేసుకొని లైసెన్స్ పొందవచ్చన్నారు. ఇతర వివరాల కోసం హెల్ప్‌డెస్క్ నంబరు 98499 07952కు సంప్రదించాలని తెలిపారు.